J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 35 29.1.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

అవగాహనా లోపం
ప్రభుత్వానికి శాపం

లోపించిన సమన్వయం
నిర్ణయాలలో అయోమయం

ఎందుకిలా
జరుగుతోంది?

# కొందరివల్లే కొంప మునుగుతోందా?

**ఆంధ్రా ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలో తెలంగాణా గ్రామం ఫోటో ముద్రించారు.!**
**ఇంతకంటే ఘోరం ఇంకేదైనా వుందా...?**
**అధికారులలో ఎందుకింత నిర్లక్ష్యం...?**
**ముఖ్యమంత్రి ఇచ్చిన చనువుని అలుసుగా తీసుకుంటున్నారా...?**

ముఖ్యమంత్రిని సైతం తప్పుదోవ పట్టిస్తున్నారు, రాజ్యాంగ వ్యవస్థలకన్నా తామే గొప్ప.. అన్న భావన కలిగిస్తున్నారు. తప్పుడు సమాచారంతో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తిప్పలు తెస్తున్నారు. ఎందుకిలా జరుగుతోంది...? ఇది అధికారుల నిర్లక్ష్యమా... లేక చుట్టూ ఉన్న సలహాదారుల దోషమా...? అని ప్రశ్నించుకుంటే.. లోపం ఇద్దరిలోనూ ఉందన్న సమాధానం విశ్లేషకుల నుండి వినపడుతోంది.

2019 మేలో వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఎన్నో సందర్భాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో తీర్పులు వచ్చాయి. భారతదేశంలోనే తొలి సారిగా ఏకంగా దేశ అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీం కోర్టు న్యాయమూర్తి పైనే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఫిర్యాదు చేసే స్థాయికి పరిణామాలు దారితీశాయి.

అటు అధికారులు కానీ, ఇటు పక్క నున్న సలహాదారులు కానీ, ప్రతి అంశం లోనూ ముఖ్యమంత్రి తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలను సమర్ధిస్తూ, ఆయన ధైర్య సాహసాలను కీర్తిస్తూ ఆయన మెప్పుపొందే ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప... సాధ్యాసాధ్యాలను, నిర్ణయం జరిగి పోయిన తరువాత జరిగే పరిణామాలను అంచనా వేయడంలో విఫలమవుతున్నారు.

## వరస తప్పులతో పలసనవుతున్నారు..

రాష్ట్ర ఎన్నికల సంఘం విషయంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చాలా తప్పట దుగులు వేసిందని ఇక్కడ చెప్పక తప్పడం లేదు. 2020, మార్చిలో

10లో




తన మధురాతి మధురమైన గంధర్వగానంతో భారతావనిని మురిపించి మైమరపింపజేసిన విశ్వవిఖ్యాత సినీ నేపథ్యగాయకుడు స్వర్గీయ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంకు భారత ప్రభుత్వం 'పద్మ విభూషణ్' పురస్కారంతో ఘననివాళు లర్పించింది. తెలుగు పాటకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన బాలు ఇప్పటికే ఎన్నో ఘనమైన పురస్కారాలను అందుకుని ఉన్నా, మరణానంతరం కూడా ఇంతటి అత్యున్నత పురస్కారానికి ఎంపిక కావడం అరుదైన విషయం. గాన ప్రపంచానికే మణిమకుటంలా భాసించిన ఆ మధుర గాయకునికి ఇంతటి గొప్ప పురస్కారం లభించడం ఎంతో సంతోషదాయకం.

12లో






# అరకకు మరక

దారి తప్పిన రైతు ఉద్యమం

3లో

## అధికారులపై ఆనం ఆగ్రహం



> ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానంటున్న మాజీమంత్రి

**రామనారాయణరెడ్డికి మళ్ళీ కోపం వచ్చింది**

సీనియర్ రాజకీయవేత్త, మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామ నారాయణరెడ్డికి మళ్ళీ కోపం వచ్చింది. ఆయన మరోసారి జిల్లా అధికారులపై తీవ్రంగా ఆగ్రహించారు.

జనవరి 26న జిల్లా పోలీస్ కవాతు మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవానికి తనకు ఆహ్వానం ఎందుకు పంపలేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. తనకే కాదని జిల్లాలో ఏ ప్రజాప్రతినిధికి ఆహ్వానాలు రాలేదని, ఈ విషయాన్ని తాను తీవ్రంగా పరిగణించి ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేయనున్నానని రామనారాయణరెడ్డి చెప్తున్నారు. గతంలో కూడా పలు సందర్భాలలో అధికారులు ఆయన అభీష్టానికి విరుద్ధంగా పనిచేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. తన నియోజకవర్గంలో సైతం ఉన్నత స్థాయి అధికారులు జోక్యం చేసుకుని తనకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆయన ఆవేదన చెందారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి

3లో

# నాటుసారాపై ముమ్మరంగా దాడులు

## పలు ప్రాంతాల్లో బట్టీలు ధ్వంసం చేసిన అధికారులు

**నిరుపేద ప్రజల జీవితాలను నాశనం చేసే నాటుసారా బట్టీలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. నాటుసారా కాస్తున్నారని తెలిస్తే చాలు..ఆగమేఘాలపై ఆ ప్రాంతాల్లో దాడులు చేసి నాటుసారా తయారీని నిరోధిస్తున్నారు.**

ఇటీవలి కాలంలో జిల్లాలో ఈ దాడులు బాగా పెరిగినా తయారీదారుల్లో మాత్రం భయం ఉండడం లేదు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఇంకా అక్కడక్కడా చాటుగా నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారంతో అధికారులు వాటిని నిరోధించడానికి మరింతగా దృష్టి సారించారు. ఈనెల 24న బోగోలు మండలంలోని కప్పరాళ్ళతిప్ప శివార్లలో ఉండే నక్కలగుంట దగ్గర కొంతమంది సైగ్గా నాటుసారా కాస్తున్నారని తెలియడంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఇబి) అధికారులు వెంటనే దాడులు చేసి అక్కడున్న నాటుసారా కుండలను, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అయితే నాటుసారా తయారు చేస్తున్న వారు మాత్రం అధికారుల్ని చూసి పలాయనం చిత్తగించారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ ఎంవి కృష్ణారావు, హెడ్‌కానిస్టేబుళ్ళు ఎస్ సాయిబాబు, ఎం.అంకయ్య, కానిస్టేబుళ్ళు కె.సుబ్బయ్య, ఎస్‌కె జిలానీ తదితరులు పాల్గొన్నారు.



నక్కలగుంట వద్ద బెల్లపు ఊటను ధ్వంసంచేస్తున్న అధికారులు

ఈనెల 25న వెంకటగిరి మండలంలోని సిసి కండ్రిగ శివారు ప్రాంతాల్లో కొందరు నాటుసారా తయారీకి సిద్ధమవుతున్నారని తెలియగానే వెంకటగిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో దాడులు చేసి అక్కడున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, బెల్లం ఊటనంతా పారబోసి కుండలను ధ్వంసం చేశారు. ఎస్ఐ రేవతి, కానిస్టేబుళ్ళు ప్రసాద్, గురవయ్య, తిరమలరావు, కృష్ణ, రవి తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

# అచ్చమాంబ అమ్మవారికి.. పొంగళ్ళు

మర్రిపాడు మండలం పొంగూరు మాలిచేలో వెలసి ఉన్న అచ్చమాంబ పేరంటాలమ్మ తల్లి ఎంతోకాలంగా భక్తులకు కొంగుబంగారమై అలరారుతోంది. ఈ ఆలయానికి ప్రతి ఆదివారం భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఈనెల 24న ఆదివారం నాడు ఆలయ అర్చకుడు వేంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

# ఓటుహక్కు ఎంతో విలువైనది




ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు ఎంతో విలువైనదని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ సుదర్శనరావు అన్నారు. ఈనెల 25న ఆయన ఓటర్లను చైతన్యవంతం చేస్తూ వివిఎస్‌యు ఆధ్వర్యంలో కళాశాల వద్ద నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయ కర్త డా.ఉదయ్‌శంకర్ అల్లం, రాజనీతి శాస్త్రం అధిపతి డా. కె.సునీత, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డా.జి.సుజయ్, డా.ఆర్.మధుమతి, డా.విజయ, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుకిషోర్, డా.సునీల్, డా.గోవింద్, పలు డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## టెక్నికల్ అధికారుల సంఘానికి
# కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపిటిఓఏ) జిల్లా శాఖ కొత్త కార్యవర్గం ఈనెల 24న ఎన్నికైంది. అధ్యక్షునిగా పి.మునెయ్య, కార్యదర్శిగా ఎస్‌కె గయాజ్ అహ్మద్, సహాధ్యక్షునిగా టివి గిరీష్‌కుమార్; ఉపాధ్యక్షులుగా మధుసూదన్, వెంకటసుబ్బయ్య, ఆర్థిక–నిర్వాహక కార్యదర్శిగా సుధాకర్‌రావు, జాయింట్ సెక్రటరీలుగా ఎం.కృష్ణారావు, ఎన్‌వి సురేష్‌లు ఎన్నికయ్యారు. నెల్లూరు దర్గామిట్టలోని ఏపి ఎన్‌జిఓల సంఘం భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రవిప్రసాద్ ఎన్నికల అధి కారిగా వ్యవహరించారు.

## దేహ సమర్పణ
# మళ్ళీ ఆరంభం

కరోనా కారణంగా 2020 సంవత్సరంలో వైద్య విద్య బోధన–పరిశోధన కోసం మానవ మృతదేహాల్ని స్వీకరించడం నిలిచిపోయిందని, ఇప్పుడు నెలలో సగం రోజుల పాటు స్వీకరించేట్లు ఏర్పాటైందని, రానున్న ఒకటి, రెండునెలల్లో అన్ని రోజుల్లో స్వీకరిస్తామని నారాయణ వైద్యశాల మానవ శరీర నిర్మాణశాఖ విభాగం తెలిపిందని పినాకిని దేహ సమర్పకుల సంస్థ నిర్వాహకుడు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. దేహ సమర్పణాభిలాషులు, సభ్యులైనవారు ఈ విషయాన్ని గమనించవలసిందిగా, సభ్యులు తమకు తెలిసిన తమ తోటి సభ్యుల దృష్టికి తేవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. దేహ సమర్పణకు సంస్థ నిర్వాహకుల కోసం ఫోన్ నెం. 232521కు సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.



# అరకకు మరక

- దారి తప్పిన రైతు ఉద్యమం
- సీరియస్‌గా తీసుకున్న కేంద్రం



*దేశ రాజధాని ఢిల్లీలో పెద్దఎత్తున చేపట్టిన రైతుల ఉద్యమం పక్కదారి పట్టింది. శాంతియుతంగా సాగాల్సిన ఉద్యమం హింస దారిపట్టింది. అన్నదాతల ఆందోళన పెడదారి పట్టి.. అరకకు మరకంటుకుది. జనవరి 26న.. రిపబ్లిక్ దినోత్సవం రోజున జరిగిన ఆందోళనలో రైతులు వేలాదిగా తరలివచ్చి వందలాది మంది భద్రతా బలగాలు, పోలీసులపై ఇష్టం వచ్చిన రీతిలో కర్రలు కరవాలాలతో దాడులు చేస్తున్న దృశ్యాలు, ఎర్రకోటపై సిక్కు జెండా ఎగరేయడాలు.. రైతుల వీరంగాలు సామాజిక మాధ్యమాల్లో చూసి దేశమే ఈ ఘోరకలికి నిర్ఘాంతపోయింది. వేలాది మంది రైతులు ట్రాక్టర్లపై దూసుకు వచ్చి అడ్డొచ్చిన పోలీసుల బలగాలపై దాడులకు తెగబడడం, హింసకు పాల్పడడం ఎంత ఘోరం!..ఎంత దారుణం!.. గణతంత్ర దినోత్సవం సాక్షిగా జరిగిన ఈ దుర్ఘటన భారతావనిలోని ప్రతి ఒక్కరినీ ఎంతగానో బాధించింది.*

ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళన ఉద్రిక్తంగా మారి.. చివరికది హింసాత్మకంగా పరిణమించింది. పోలీసులు అనుమతిచ్చిన దారిలో కాక మరోదారిలో వచ్చిన వేలాదిమంది రైతులు ఢిల్లీని ముట్టడించి ఎర్రకోటపై సిక్కు జెండా ఎగరేసే దాకా జరిగిన రైతుల ఆందోళన భయంకర భీభత్సాన్నే సృష్టించింది. రైతులు కర్రలతో భద్రతా బలగాలపై.. పోలీసులపై దాడులు చేస్తూ.. అనేకమందిని కర్రలతో కొట్టి కిందకి విసిరేస్తూ వీరంగం చేస్తున్న దృశ్యాలను మాధ్యమాల్లో చూసిన దేశ ప్రజలంతా ఇదేం రైతు ఉద్యమం అంటూ నిరసిస్తున్నారు. ఒక్కసారిగా రైతులు భారీ స్థాయిలో ట్రాక్టర్లపై దూసుకువచ్చి భద్రతా ఏర్పాట్లను, భద్రతా బలగాలను చిందర వందర చేసిపారేశారు. అడ్డొచ్చిన వారిపై ఇష్టం వచ్చినట్లు దాడులు చేశారు. ఈ దాడుల్లో దాదాపు మూడు వందల మందికిపైగానే పోలీసులు గాయపడ్డారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉండిందో అందరికీ అర్థమవుతుంది. రైతుల ఆందోళన ఇలా దారి తప్పడానికి కొంతమంది సంఘవిద్రోహశక్తులు తమ ఉద్యమంలోకి ప్రవేశించడం వల్లనేనని, ఉద్యమం పక్కదోవ పట్టడానికి ఆ విద్రోహశక్తులే కారణమంటూ పలువురు రైతు నాయకులు ఆందోళనతో ఇప్పుడు ప్రకటనలు చేస్తున్నారు. ఆ విద్రోహశక్తులు బింద్రేన్‌వాలా అనుచరులై ఉంటారని కొందరు అంటుంటే, కాదు.. వాళ్ళు బిజెపికి చెందిన వారై ఉండవచ్చేమోనని మరికొందరు రకరకాలుగా వాదనలు చేస్తున్నారు.

ఈ ఆందోళనలో హింసాత్మక సంఘటనలు జరగవచ్చని ఇప్పుడు కాదు, ఈ ఉద్యమం ప్రారంభరోజుల్లోనే కేంద్రం పసిగట్టింది. అయినప్పటికీ ట్రాక్టర్ ర్యాలీకి అనుమతిచ్చింది. దీంతో ఎంతో బాధ్యతాయుతంగా, మరింత శాంతియుతంగా తమ నిరసన తెలియజేయాల్సిన రైతులు, రైతునాయకులు పోలీసులతో చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా రూటుమార్చి, భద్రతా వలయాలను చిందరవందర చేస్తూ, అడ్డొచ్చిన వాహనాలను ధ్వంసం చేస్తూ, పోలీసులపై ఇష్టం వచ్చినట్లుగా దాడులు చేస్తూ పరిస్థితిని హింసాత్మకం చేయడం ఘోరం!.. గణతంత్ర దినోత్సవాన్ని దేశమంతా ఒక పండుగలా జరుపుకుంటున్న రోజునే సాక్షాత్తూ ఢిల్లీలో ఇలాంటి దుర్ఘటనలు జరగడం ఎంతైనా బాధాకరం. సగర్వంగా భారత జాతీయ పతాకం ఎగరాల్సిన ఎర్రకోట మీద మరో జెండాను ఎగురవేయడం దారుణం!.. జాతికి గర్వకారణమైన జాతీయజెండానే అవమానించడాన్ని ఎవరూ సహించరు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కొందరు ఉద్యమ నాయకులు సైతం ఇలా జరగడం సరికాదంటూ ఇప్పుడు ఆ దుర్ఘటనల్ని నిరసిస్తున్నారు కూడా. ఇలాంటి ఘటనలను నిరసిస్తూ ఈ ఉద్యమంలో ఉన్న పలు సంఘాలు కూడా ఆందోళన బాట నుంచి వైదొలగిపోతున్నామంటూ ప్రకటిస్తున్నాయి. ఈ విధ్వంసాలపై కేంద్రం కన్నెర్రజేస్తోంది..జాతీయజెండాను అవమానించడాన్ని కేంద్రం చాలా సీరియస్‌గా తీసుకుంది. హింసాత్మక ఘటనలకు బాధ్యులైన వారిపై చర్యలకు సిద్ధమవుతోంది. ఏదేమైనా ఎంతో శాంతియుతంగా సాగాల్సిన రైతు ఉద్యమం ఇంత ఘోరంగా పెడదారి పట్టి.. హింసాత్మకంగా తయారుకావడంతో రైతులోకం అప్రదిష్టకు గురవుతోంది.

## సినిమాహాళ్లు, స్విమ్మింగ్ పూళ్ళు

## ఇక ఫుల్లు...



కరోనా తరుణంలో లాక్‌డౌన్లతో మొదలైన ప్రభుత్వ ఆంక్షలు ఒక్కొక్కటిగా సడలింపబడుతున్నాయి. ఇప్పటివరకు 50శాతం సీటింగ్ కెపాసిటీతో అనుమతింపబడుతుండిన సినిమాహాళ్లలో ఫిబ్రవరి 1వతేదీ నుండి 100 శాతం సీటింగ్‌కి అనుమతి ఇస్తున్నారు. ఇక కొత్త సినిమాలను హౌస్‌ఫుల్ బోర్డుతో ఎగ్జిబిటర్లు తమ హాళ్లను నడుపుకోవచ్చు.

### ఈతకొలనులకు కూడా అనుమతి..



ఇన్నాళ్లూ మూసేసిన స్విమ్మింగ్ పూళ్ళను కూడా ఫిబ్రవరి 1వతేది నుండి తెరుచుకోవచ్చు. వేసవి రానున్న సమయంలో ఈత ప్రియులకు ఇది చల్లని వార్త. కరోనా పూర్తిగా పోలేదు, భయం మాత్రం పోయింది.. తస్మాత్ జాగ్రత్త.

## బళ్లకు ఎండా కాలపు సెలవులు లేవు..

కరోనా పుణ్యమా అని గత మార్చి నుండి బడికి వెళ్లకుండా ఉన్న పిల్లలకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ చేదు కబురు తియ్యగా చెప్పింది. ఈసారి వేసవి సెలవులు ఉండబోవని, సిలబస్ పూర్తి కావలసి ఉండాల్సినందున ఎండా కాలంలో కూడా బడి తెరవాలని ఆదేశించింది. ఫరవాలేదులేండి 'నాడు – నేడు' పుణ్యమా అని ఇప్పుడు అన్ని ప్రభుత్వ బళ్ళలో కూడా ఫ్యాన్‌లు పెట్టింటారు కాబట్టి ఇబ్బంది లేదు.

## జైలు నుండి బయటకొచ్చిన 'చిన్నమ్మ'



జయలలిత హయాంలో తమిళనాడులో చక్రం తిప్పిన ఆమె నెచ్చెలి శశికళ జైలునుండి విడుదలయ్యింది. అక్రమార్జన కేసులో నాలుగేళ్ల శిక్షపడి బెంగుళూరు జైలులో ఉన్న ఆమె శిక్షాకాలం పూర్తికావడంతో బయటకొచ్చింది. ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె రెండు మూడు రోజుల్లో డిశ్చార్జ్ అయ్యి చెన్నైకు వెళ్లనుంది. తమిళనాడులో ఎన్నికల సందడి మొదలైన తరుణంలో, శశికళ బయటకు రావడంతో తమిళనాట కొత్త పొత్తులు ఏర్పడే అవకాశాలు దండిగా వున్నట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా. చూడాలి చిన్నమ్మ మహిమ ఎలా వుండబోతుందో, జైలుకి వెళ్లొచ్చిన వేళా విశేషం ఆమెకు ఎలా కలిసొస్తుందో.

## 'మురళీకృష్ణ' గోపాలయ్యకు ఘన నివాళి



గోపాలయ్యకు నివాళులర్పిస్తున్న రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, డాక్టర్ కిషోర్స్ రత్నం నిర్వాహకులు కిషోర్ - వాసంతిలు

మురళీకృష్ణ70 హోటల్స్ వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలయ్య దశదిన క్రియలు గురువారం ఉదయం జరిగాయి. రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులతో పాటు పలువురు రాజకీయ నేతలు, రాజకీయేతర ప్రముఖులు, వ్యాపారవేత్తలు, పలు విద్యాసంస్థల నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు, హోటల్స్ యాజమాన్యం, గాండ్ల తెలికుల సంఘం సభ్యులు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులు, మురళీకృష్ణ సంస్థల సిబ్బంది, గోపాలయ్య కుటుంబ అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు.

## అధికారులపై.. ఆనం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

దృష్టికి తీసుకెళ్లినట్టు కూడా ఆయన గతంలో వెల్లడించారు. తాజాగా గణతంత్ర దినోత్సవాలకు తనకు ఆహ్వానం ఎందుకు పంపలేదని అధికారులను ప్రశ్నిస్తే సమాధానం లేదని ఆయన చెప్పాడు. ఒక వేళ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో తమను పిలవకూడదని ఎన్నికల కమిషన్ ఏదైనా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందా...? లేక ప్రభుత్వ పరిపాలనా విభాగం ఏమైనా లేఖ రాసిందా ...? అలాంటివి ఏమైనా ఉంటే తనకు చూపించమంటే అధికారుల దగ్గర సమాధానం లేదని ఆయన చెప్పాడు. పక్క జిల్లా ప్రకాశంలో స్వయంగా జిల్లా కలెక్టరే అందరికీ ఫోన్‌చేసి ఆహ్వానించాడని అక్కడ లేని రూలు ఇక్కడెలా వర్తిస్తుందని ఆయన ప్రశ్నించారు.

ఒక భారతీయ పౌరుడిగా గణతంత్రదినోత్సవాలలో పాల్గొనే హక్కు తనకుందని , తనకు ఆహ్వానం పంపకపోవడంపై చట్టపరంగా అధికారులపై కేసులు కూడా పెడతానని, అందుకోసం న్యాయ నిపుణుల సలహా తీసుకుంటున్నానని ఆనం చెప్పారు.

జిల్లాలో ఎవరి ఆదేశాలతో అధికారులు ఇలా ప్రవర్తిస్తున్నారో తేల్చాలని, ఇదే జిల్లాకి చెందిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఛైర్మెన్‌గా ఉన్న ప్రివిలేజ్ కమిటీ దృష్టికి అన్ని విషయాలు తీసుకెళ్తానని రామనారాయణ చెప్తున్నారు. ఇటీవల జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో కూడా ఆయన అధికారులతో విభేదించారు. వారి కార్యక్రమాలు ముగించుకుని వెళ్లేవరకూ తాను వేదికపైకి రానని మొరాయించడంతో గూడూరు సబ్ కలెక్టర్ ఆ కార్యక్రమంలో పాల్గొనకుండానే వెనుతిరిగి వెళ్ళాడు.

2007 నుండి 2014 వరకు రామనారాయణరెడ్డి మంత్రిగా ఉన్నారు. దివంగత నేత రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి క్యాబినెట్‌లలో సమాచార పౌర సంబంధాల శాఖ, మునిసిపల్ శాఖ , ఆర్థిక శాఖల మంత్రిగా ఆయన విధులు నిర్వహించారు. ఒక రకంగా చెప్పాలంటే ప్రస్తుతం జిల్లాలో వున్న వైసిపి శాసనసభ్యులందరిలోకి ఆయన సీనియర్. వైయస్ మరణానంతరం ఆయన చేసిన కొన్ని తప్పిదాల వల్ల ఈరోజు ఆయనకు ఈ దుస్థితి ఏర్పడింది. వైసిపికి చేరువ కాకపోవడమే కాకుండా మధ్యలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకోవడం అనంతరం వైసిపిలోకి రావడంతో రాజకీయంగా ఆయన గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. ఆయన సోదరుడు ఆనం వివేకానందరెడ్డి మరణం కూడా ఆ కుటుంబానికి పెద్ద లోపం, శాపం. అప్పట్లో ఆనం కంటే ఎక్కువ స్థాయిలో వైసిపిని విమర్శించినా ఆనం సన్నిహితులు బొత్సా లాంటి వాళ్ళు ఇప్పుడు మంత్రులుగా ఉన్నారు. కానీ ఆనం వేసిన ఒక్క తప్పటడుగు వల్ల ఇప్పుడు జిల్లాలో ఏకాకిగా మారిపోయాడు. రాజకీయాలలో ఏదీ శాశ్వతం కాదు, వేచి చూద్దాం భవిష్యత్తులో ఏం జరుగుతుందో ...!

## 'నడక నాయకుడి' ప్రమాణస్వీకారోత్సవం



వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 14వ క్యాబినెట్–2021 ఏర్పాటు బుధవారం నాడు నెల్లూరులో జరిగింది. గవర్నర్‌గా యాకొల్లు రాఘవరెడ్డి, కార్యదర్శిగా నలుబోలు బలరామయ్యనాయుడు, కోశాధికారిగా సరాబు వెంకట సత్యనారాయణల చేత ఇన్‌స్టాలేషన్ అధికారిగా వ్యవహరించిన వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు హనుమంతురావు ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కొత్త సభ్యులను అభిమానులు సత్కరించారు.




## 'ప్రభా'తం

# నేలతల్లి.. కంట తడి!..

మానవుడికి విజ్ఞానం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ భూమిని భద్రంగా కాపాడుకునే చర్యలు చేపట్టకుండా, ఏళ్లతరబడిగా ప్రకృతిని, పర్యావరణాన్ని దెబ్బతీస్తుండడంతో పుడమితల్లికి అపార నష్టం కలుగుతోంది. భూమాతను, ప్రకృతిని పరిరక్షించుకోకుండా మానవుడు తన స్వార్థం కోసం అనుసరిస్తున్న వికృత చర్యల వల్ల జీవవైవిధ్యం బాగా దెబ్బతింటోందని, దీంతో జీవరాశులు క్రమేణా అంతరించిపోతున్నాయని నిపుణుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇకనైనా ప్రపంచదేశాలన్నీ కలదెలుసుకుని వెంటనే ప్రకృతి పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జీవరాశుల మనుగడకు ముప్పు రాకుండా జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి.

తల్లి లాంటి నేలతల్లి కంటతడి పెడుతోంది. ప్రకృతి సోయగాలతో, పచ్చదనంతో కళకళలాడాల్సిన ధరణీమాత మానవుడి వికృత ప్రవృత్తికి విలవిలలాడుతోంది. మనకు అడక్కుండానే అన్నీ ఇచ్చే అమ్మ..ఈ నేలమ్మ ఈ దుస్థితికి కుంగిపోతూ అసహాయస్థితిలో మూగవేదన పడుతోంది. ఒక్క మనుషులకే కాదు, సకల చరాచర జీవరాశులకు, వృక్షజాతులకు అన్నిటికీ ఆవాసం కల్పించే భూమాత ఇప్పుడు భూతాపంతో అల్లాడుతోంది. చల్లదనాన్ని, ప్రాణవాయువులందించే శీతల పవనాల్ని క్రమంగా కోల్పోతూ చివరికి రానురాను జవసత్వాలు కోల్పోతోంది. అయినా, మానవుడు తన తీరు మార్చుకోవడం లేదు. ఏళ్ళ తరబడిగా చిత్తం వచ్చిన రీతిగా వ్యవహరిస్తూ, ఇష్టం వచ్చినట్లుగా అడవుల్ని అడ్డంగా నరికేస్తూ తన స్వార్థం కోసం, కేవలం తన మనుగడ కోసం సమస్త ప్రకృతిని..జీవరాశుల్నీ ఛిద్రం చేస్తున్నాడు. మానవుడు తన మానాన తాను హాయిగా బతికేందుకు అనేక అవకాశాలు ఈ భూమ్మీద ఉన్నా, వాటన్నిటినీ కాలదన్ని లేనిపోని దురాశలతో ప్రకృతిని నాశనం చేస్తుండడం వల్ల చివరికి పుడమితల్లి పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోందని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. తాజాగా వరల్డ్ లైఫ్ ఫండ్ వెలువరించిన 'లివింగ్ ప్లానెట్ రిపోర్ట్-2020'లో పేర్కొన్న వివరాలు చూసైనా ప్రపంచంలోని సకలమానవాళికి కనువిప్పు కావాల్సి ఉంది. మానవుడికి విజ్ఞానం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ భూమిని భద్రంగా కాపాడుకునే చర్యలు చేపట్టకుండా, ఏళ్ళ తరబడిగా పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తుండడంతో పుడమితల్లికి అపార నష్టం కలుగుతోందని, తమ తమ దేశాల్లో విస్తారంగా ఉన్న అడవులను రక్షించుకోలేకపోగా ఉన్న అడవులను కొట్టేస్తుండడంతో అడవుల్లో పెరిగే జంతువులు, వన్యప్రాణులు, వృక్షజాతులు, అనేక జీవరాశులు అన్నీ క్రమేణా అంతరించిపోతున్నాయని, ప్రకృతి పట్ల మానవుడు అనుసరిస్తున్న ఇలాంటి వికృత చర్యల వల్ల జీవవైవిధ్యం బాగా దెబ్బతింటోందని, దీంతో గడచిన యాభై ఏళ్ళలో దాదాపు 68 శాతంపైగానే జీవరాశులు క్రమేణా అంతరించిపోయాయని ఆ నివేదికలు వెల్లడిస్తున్నాయి. చివరికి మట్టిలో కూడా జీవవైవిధ్యం బాగా దెబ్బతింటోందని, ఇకనైనా ప్రపంచదేశాలన్నీ కలదెలుసుకుని ఒకేతాటిపై నిలిచి వెంటనే ప్రకృతి పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పు తప్పదని ఆ నివేదికలు ఎంతో ముందుచూపుతో హెచ్చరిస్తున్నాయి.

మరోవైపు ప్రపంచవ్యాప్తంగా జనాభా ఏఏటికాయేడు అంతకంతకూ పెరిగిపోతూనే ఉంది. దాదాపు ఎనిమిది వందల కోట్లకు పైగానే ఉన్న ప్రస్తుత ప్రపంచ జనాభా మరో పాతికేళ్ళకు ఇంకెన్ని వందల కోట్లకు పెరుగుతుందో చెప్పలేం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు సమకూర్చుకోలేకపోతే మానవ మనుగడ సంక్లిష్టదశకు చేరుకుంటుంది. మన చుట్టూ ఉన్న ప్రకృతిని, సహజ వనరులను కాపాడుకోలేకపోతే చివరికి మానవుడి పరిస్థితే అగమ్యగోచరమవుతుంది. దానికితోడు ఈ ఆధునిక కాలంలో మానవుని అవసరాలు లెక్కకు మిక్కుటంగా పెరిగిపోతున్నాయి. ఇదిలావుంటే.. పర్యావరణానికి ఎంతో హాని కలిగించే కర్బన ఉద్గారాలను పెద్దఎత్తున వెలువరించే ఇంధనాల వినియోగాన్ని అదుపు చేయలేకపోతుండడంతో, కాలుష్యాలను నివారించలేకపోతుండడంతో రానున్న కాలం మరింత గడ్డుగా ఉంటుందని ఎంతోకాలంగా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా ఎవరు పట్టించుకుంటున్నారు గనక?..నానాటికీ పచ్చని పంటపొలాలు, అటవీప్రాంతాలు అన్నీ మానవుల దురాశలకు అవాసస్థానాలుగా మారిపోతున్నాయి. క్రమేణా గాలి, నీరు, నేల.. అన్నీ కాలుష్య కాసారాలైపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి, నదీజలాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకుపోతున్నాయి. చివరికి తాగేందుకు కూడా పరిశుభ్రమైన నీరు దొరక్క ఇప్పటికే ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజలు నానా యాతనలు పడుతూనే ఉన్నారు. కలుషిత వాతావరణంలో ఎప్పటికప్పుడు కొత్తకొత్త వ్యాధుల బాధలు సంక్రమిస్తూ నిత్యం ఎందరి ప్రాణాలో హరిస్తున్నాయి. మానవుడు తన మేధస్సుతో నానాటికీ పెనుభూతంలా తయారవుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోకపోగా, ప్లాస్టిక్ వంటి అనవసర వ్యర్థాలతో కూడిన సరికొత్త కాలుష్యాలను భారీగా పెంచి పోషిస్తూ చివరికి మానవ మనుగడకే ముప్పు వాటిల్లేలా చేసుకోవడం ఎంతైనా విచారకరం. ఇకనైనా మొక్కలను విస్తారంగా పెంచుకోవడం, వనాలను సంరక్షించుకోవడం, వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు బదులు ప్రకృతి సేద్యానికి బాటలు వేసుకోవడం, ప్రకృతి సమతుల్యాన్ని కాపాడుకునేందుకు, అన్ని రకాల కాలుష్యాలను నివారించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతిఒక్కరూ తమవంతు కృషిచేయడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇకనైనా మానవుడు తన తప్పును తెలుసకోవాలి. ముంచుకొస్తున్న ముప్పును ముందుచూపుతో నివారించుకోవాలి. ఇప్పుడున్న వికృత ధోరణిని మార్చుకొని ధరణిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. నేలతల్లి కన్నీరు తుడిచేలా..ఈ నేలంతా పులకించి పరవశించిపోయేలా పచ్చదనాన్ని పరవాలి. ఈ నేలతల్లి బిడ్డగా మానవుడు.. తన జీవితాన్ని సార్థకం చేసుకుంటూ పురోగమించాలి. ఈ ధరణిపై హరిత పతాకాన్ని సగర్వంగా ఎగురవేయాలి. ప్రపంచమంతా హరితశోభలతో విలసిల్లేలా అన్ని దేశాల అధినేతలు, శాస్త్రవేత్తలు, మేధావులు, ప్రజలు అందరూ ఒక్కటై కలసి.. సకల జీవరాశుల కోసం..మానవాళి మనుగడ కోసం.. భావితరాల భవిత కోసం.. చక్కని హరిత ప్రపంచం కోసం ప్రతిఒక్కరూ ప్రతినబూనాలి. ప్రకృతిని పరిరక్షించుకోవడమే సకల మానవాళి ధ్యేయం కావాలి. నేలతల్లికి కొత్త వసంతం తేవాలి. ఆ దిశగా అందరూ ఏకమై ముందడుగు వేయాలి!...

---

# పల్లెల్లో పంచాయతీ సందడి



- గ్రామాల్లో ఎన్నికలకు రంగం సిద్ధం
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

***గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. కరోనా నేపథ్యంలో గత ఏడాది మార్చి నెలాఖరులో వాయిదా పడిన స్థానిక సంస్థల ఎన్నికలు వివాదాస్పదం కాగా ఎట్టకేలకు సుప్రీం తీర్పుతో ఎన్నికల నిర్వహణకు అధికారగణం సమాయత్తమైంది. రాజకీయపార్టీలకు ఇక చేతినిండా పని దొరికినట్లయింది. పల్లెల్లో విజయకేతనం ఎగురవేసేందుకు ఎవరిపాటికి వారు కార్యక్రమాలను ముమ్మరం చేస్తుండడంతో పల్లెల్లో రాజకీయ సందడి పెరిగింది. పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేన్లు ఉండడంతో ఈసారి మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య పెరగవచ్చని కూడా భావిస్తున్నారు. అధికారపక్షంతో పాటు ప్రతిపక్ష పార్టీలు ఈ ఎన్నికల్లో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటికే అన్నిపార్టీల వారు ఆయా ప్రాంతాల్లో అభ్యర్థుల వేటలో తలమునకలై ఉన్నారు.***

### ఈ నెల 29వ తేది నుంచి నామినేషన్ల ప్రక్రియ :

జిల్లాలో మొత్తం 941గ్రామపంచాయతీలు, 8,842 వార్డులకు జరగనున్న ఎన్నికలు నాలుగు దశల్లో జరుగనున్నాయి. తొలిదశలో కావలి డివిజన్‌లోని 9 మండలాల్లో 163 గ్రామ పంచాయతీలు, 1,566 వార్డులకు ఎన్నికలు నిర్వహించాలని అధికారులు సమాయతమవుతున్నారు. అందుకు తగ్గట్టుగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 29 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లా ఉన్నతాధికారులు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి బందోబస్తు ఏర్పాట్ల విషయమై పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై చర్చలు సాగిస్తున్నారు.

### ఏకగ్రీవాలపై వైఎస్సార్సీపి దృష్టి :

రాష్ట్రంలో అధికారపార్టీకి చెందిన వైయస్సార్సీపి నాయకులు ఏకగ్రీవ పంచాయతీలపై దృష్టి సారిస్తున్నారు. ఇవి పార్టీలకు అతీతంగా జరుగుతున్న ఎన్నికలు కాబట్టి పంచాయతీలను ఏకగ్రీవం చేసుకోవడం ద్వారా గ్రామాల అభ్యున్నతికి బాటలు వేసుకుందామంటూ ప్రభుత్వం సూచిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో గ్రూపులు, ఘర్షణలకు తావు లేకుండా ప్రజలంతా అన్నదమ్ముల్లా కలసిమెలసి జీవించేలా ఏకగ్రీవాలకు ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సాహకాలను కూడా ప్రకటించింది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవమైతే గ్రామాభివృద్ధికి జనాభాను బట్టి ప్రభుత్వం 5 నుంచి 20 లక్షల రూపాయల దాకా ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో అనేకరకాల సమస్యలు పరిష్కారం అవుతుండడం, ప్రజలకు సంక్షేమ పథకాలు ఇళ్ళ వద్దకే వస్తుండడంతో గ్రామస్థాయిలో వైఎస్సార్సీపి బలోపేతంగా ఉందని, కనుక పోటీ లేకుండా అధికస్థానాలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలపై అందరూ దృష్టి పెట్టాలని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు.

---

# ఈ దుర్గంధం నుండి కాపాడండి



ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

నెల్లూరు నగరం భూదాహంతో రోజు రోజుకూ తన పరిధిని పెంచుకొని చుట్టూ ఉన్న పల్లెల్ని, పేటల్ని తనలో ఇముడ్చుకొని అడ్డదిడ్డంగా విస్తరిస్తోంది. ఒకనాడు స్వచ్ఛమైన నెల్లూరు చెరువు నీళ్ళతో కళకళలాడిన పంటకాలువలు ఇప్పుడు సెప్టిక్ ట్యాంకుల మలమూత్రాలతో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కాలువలుగా మిగిలాయి. గుర్రంగిట్ట ఆకు పెరిగి ఆ రవంత కాలువలు పూడిపోయి నీరు పారకుండా అడ్డుపడి సమీపంలో ఇళ్ళవాళ్ళకు దుర్గంధం, దోమల బాధను మిగిల్చాయి. వేసవివస్తే మరింత నరకం.

నెల్లూరు దర్గామిట్ట ఏరియాకు చెందిన శాంతినగర్, ఫతేఖాన్ పేట మధ్య పీటర్సు కెనాల్ అనే దుర్గంధ భరితమైన మురికి కాలువ పూడికతీసి శుభ్రంచెయ్యక ఎన్నేళ్ళయిందో. ఈ దుర్గంధంతో స్థానిక ప్రజలు పడే బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. మురుగుదిబ్బ లాగా ఉన్న ఈ కాలువ వల్ల దోమలు, ఈగలు కుప్పలు తెప్పలుగా పెరిగిపోతూ లేనిపోని రోగాలకు గురిచేస్తున్నాయి. మేము శాంతినగర్ చివర సగిలంవారి వీధికి సమీపంలో ఉంటున్నాము. రాత్రులు నిద్ర ఉండదు. దోమలబాధ, మురుగు దుర్గంధం భరించలేకపోతున్నాము. మునిసిపల్ అధికారులు ఈ కాలుష్యం నిండిన కాలువను శుభ్రం చేయించి శాంతినగర్, పత్తేఖానుపేట, టెక్కేమిట్ట వాసులను అనారోగ్యం బారిన పడకుండా కాపాడవలసినదిగా వేడుకొంటున్నాను.

డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, నెల్లూరు.

# స్వర్గధామాలు...

# 'విపిఆర్ విల్లాలు'




- నెల్లూరులో తొలిసారిగా విలాసవంతమైన భవంతులు
- నాలుగులైన్ల రహదారికి తూర్పున ఆవిష్కృతమవుతున్న కొత్త నగరం

*నెల్లూరుజిల్లా వాసులకి మహానగరాల తరహా జీవనశైలిని పరిచయం చేస్తున్నారు రాజ్యసభసభ్యులు, 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. నగర పొలిమేరల్లో నాలుగులైన్ల రహదారి పక్కనే ఆయన నిర్మిస్తున్న గృహ సముదాయం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.*









అత్యంత విలాసవంతమైన ఇండిపెండెంట్ ఇళ్లను 'విపిఆర్ శాంతినికేతన్ విల్లాలు' పేరుతో గేటెడ్ కమ్యూనిటీగా నిర్మించారు. దాదాపుగా పూర్తి కావొచ్చిన ఈ గృహ సముదాయం ఇప్పుడు నెల్లూరులోనే అత్యంత విలాసవంతమైన అధునాతన నివాస ప్రాంగణంగా తయారై, ఒక్క నెల్లూరుజిల్లాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెల్లూరీయులను ఆకట్టుకుంటోంది. 55విల్లాలతో నగర శివార్లలో కనుపర్తిపాడుకు



సమీపంలో రూపుదిద్దుకున్న ఈ ప్రాంగణంలో తొలుతగా మోడల్ విల్లాను అంతర్జాతీయ స్థాయి హంగులతో అలంకరించారు. ఔరా అనిపించే స్థాయిలో ఆకట్టుకుంటున్న ఈ మోడల్ విల్లాను చూసినవారు 'నెవర్ బిఫోర్ ఎవర్ ఆఫ్టర్' అని కితాబిస్తున్నారు. సామాజిక మాధ్యమాలద్వారా అంతర్జాతీయంగా ఉన్న నెల్లూరీయుల సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల స్క్రీన్లపై దర్శనమిచ్చిన మోడల్ విల్లా ఛాయాచిత్రాలు(ఫోటోలు) చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అత్యాధునిక వసతులతో అత్యున్నత స్థాయిలో జీవన ప్రమాణాలను పొందుపరచి ఇంటీరియర్ చేసిన ఈ మోడల్ విల్లాను భూలోక స్వర్గధామంగా అభివర్ణిస్తున్నారు. ఇతర దేశాలలో ఉన్న నెల్లూరీయులు సైతం ఇక్కడ తమకొక ఇల్లు వుంటే బాగుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసేలా ఈ విల్లాలు నిర్మించబడ్డాయి.


విపిఆర్ శాంతినికేతన్‌లో ఇల్లుంటే అది స్టేటస్‌కి కేరాఫ్ అడ్రస్‌లాగా ఇక్కడ ఇల్లు కొన్నవారు భావించేలా ఈ గేటెడ్ కమ్యూనిటీ గుర్తింపును సాధించిందంటే అతిశయోక్తి కాదేమో. కాంక్రీట్ జంగిల్‌లా మారిన నగరంలో నివాసం ఉండడం కన్నా, నగర శివార్లలో కాలుష్యానికి దూరంగా ప్రశాంత వాతావరణంలో ఉండాలనుకునేవారికి చిరునామాగా 'విపిఆర్ శాంతినికేతన్' విల్లాలు ఊరికి దూరంగా ఆహ్లాదకరమైన పరిసరాలతో ఏర్పాటు చేయబడ్డాయి. తాము ఏ పనిచేసినా నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యత కల్పించే వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతుల శ్రద్ధ, ఆసక్తి, అభిరుచి, అంకితభావం అణువణువునా ఈ ప్రాంగణంలో మనకు కనిపిస్తాయి.

బయట దేశాలలో, నగరాలలో ఉండే నెల్లూరోళ్ళంటే చాలామందికి ఆసక్తి ఎక్కువ. నెల్లూరోళ్లు ఏంచేసినా దానికొక ప్రత్యేకత ఉంటుందని అంటుంటారు. ముఖ్యంగా హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు లాంటి నగరాలలో నెల్లూరీయులు నిర్మించిన ఇళ్ల గురించి ప్రత్యేకంగా చర్చించుకుంటుంటారు. ఇప్పుడు అదే తరహా లగ్జరీ భవంతులను తొలిసారిగా నెల్లూరులోనే కట్టి చూపిస్తున్నారు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ఆయన



నిర్మిస్తున్న విల్లాల పుణ్యమా అని చుట్టుపక్కల భూముల విలువ రోజురోజుకి పెరిగిపోతోంది. నాలుగులైన్ల రహదారికి తూర్పు వైపున కొత్త నగరం ఆవిష్కృతమవుతోంది.

గొలగమూడి రోడ్డు కూడలిలో నాలుగులైన్ల రహదారిపై వంతెన నిర్మితమై అండర్ పాస్ ఏర్పడితే రాబోయే 10 సంవత్సరాలలో నెల్లూరు రెండింతలుగా ఎదిగిపోతుంది కూడా.













# హమ్మయ్య!.. నిమ్మ ధరలు పెరిగాయి

- పెరిగిన ఎగుమతులు.. ఆనందంలో రైతులు

*కరోనా నేపథ్యంలో గత కొంత కాలంగా నిమ్మకాయలకు సరైన గిట్టుబాటు ధరలు లేక, రవాణాకు మార్గాలు లేక అనేకవిధాలుగా కష్టనష్టాలకు గురైన నిమ్మ రైతులు ప్రస్తుతం నిమ్మ ధరలు పెరగడంతో సంతోషిస్తున్నారు. నిమ్మకు మంచి డిమాండ్ రావడంతో ఇంతకాలం పడిన కష్టాల నుంచి గట్టెక్కవచ్చని భావిస్తున్నారు.*

మన జిల్లా నిమ్మకు రాష్ట్రంలోనే కాక రాష్ట్రేతర ప్రాంతాల్లో కూడా మంచి పేరుంది. దీంతో దేశంలోని అనేక ప్రాంతాలకు నిమ్మ ఎగుమతులు భారీగా జరుగుతుంటాయి. జిల్లాలోని గూడూరు, పొదలకూరు తదితర ప్రాంతాల్లో నిమ్మ పంటను విస్తారంగా పండిస్తున్నారు. ఒక్క



పొదలకూరు మండలంలోనే దాదాపు 4500హెక్టార్లలో నిమ్మ సాగవుతుంటుంది. ఈ ఏడాది కోల్‌కతా, ఢిల్లీ మార్కెట్లలో నిమ్మకాయలకు మంచి డిమాండ్ ఏర్పడడంతో జిల్లా నుంచి ఎగుమతులు ఊపందుకున్నాయి. దీంతో బస్తా నిమ్మకాయల ధర 1900 నుంచి కాయల నాణ్యత, సైజును బట్టి 2600 రూపాయల దాకా పెరిగింది. పొదలకూరు మార్కెట్‌కు చుట్టుపక్కల అనేక గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం నిమ్మకాయలు పెద్దసంఖ్యలోనే వస్తున్నాయి. సాధారణంగా మార్చి నుంచి మే నెల దాకా నిమ్మకాయలకు బాగా డిమాండ్ ఉంటుంది. అయితే ఈ ఏడాది జనవరి నుంచే డిమాండ్ ఏర్పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పొదలకూరు ప్రాంతం నుంచి రోజూ కనీసం రెండు లారీల నిమ్మకాయలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి.

# రహదారి భద్రత.. జీవితాలకు రక్ష

**జేసీ ప్రభాకర్‌రెడ్డి**

రహదారి భద్రత జీవితాలకు రక్ష అని, ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎన్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.

ఈనెల 18 నుంచి వచ్చేనెల 17వ తేది వరకు జరుగుతున్న 32వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 25న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనాలను నడిపేటప్పుడు ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సీటు బెల్టు పెట్టుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. గత ఏడాది జిల్లాలో 1142 ప్రమాదాలు జరిగి, 503 మంది మరణించారని, 1175 మంది గాయాలపాలై అంగవైకల్యంతో పడుతున్న బాధలు వర్ణనాతీతమని చెప్పారు. రోడ్డు ప్రమాదాల పాలైన కుటుంబాల వేదనను ఆయన కళ్ళకు కట్టేలా వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం ఈ మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు రహదారి భద్రత అవగాహన కల్పిస్తూ బైక్‌ర్యాలీని ప్రారంభించారు. ఉప రవాణా కమిషనర్ సిహెచ్‌వికె సుబ్బారావు, ఆర్టీఓ సుశీల, ఏ.ఓ మదాని, ఎంవిఐలు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## రవాణాశాఖ సేవలు అమోఘం

### - రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం

జిల్లా రవాణా శాఖ సేవలు అమోఘంగా ఉంటూ, పౌరులకు ఉత్తమ సేవలందిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి అందరి ప్రశంసలందుకుంటోంది. జిల్లా ఉప రవాణా కమిషనర్ సిహెచ్‌వికె సుబ్బారావు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ విషయం చెప్పారు. నెల్లూరులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ఉత్తమసేవలందిస్తున్న అధికారులను, సిబ్బందిని అభినందించారు. విశిష్ట సేవలందిస్తున్న గూడూరు ఆర్టీఓ మల్లికార్జునరెడ్డి, ఎంవిఐలు సునీల్, మాధవరావు, పరిపాలనాధికారి మదానీలకు శుభాభినందనలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సుశీలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాన్ సాయం అందించండి

### - టిడిపి నాయకుల వినతి

నివర్ తుఫాన్ బాధితులకు ప్రభుత్వం సాయం ప్రకటించి రెండు నెలలవుతున్నా నెల్లూరులోని 38వ డివిజన్ మనుమసిద్ధినగర్, ఉయ్యాల కాలువ ప్రాంతంలో నివసిస్తున్న వారికి ఆ సాయం ఇంకా అందలేదని, అధికారులు పరిశీలించి ఆ సాయాన్ని బాధిత కుటుంబాలకు అందించాలని నగర టిడిపి నాయకులు ధర్మవరపు సుబ్రహ్మణ్యం తదితరులు ఈనెల 25న కలెక్టరేట్‌కు వెళ్ళి ఏ.ఓ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర నాయకులు కప్పిర శ్రీనివాసులు, రేవతి, శైలజ, పడవల కృష్ణమూర్తి, మహంకాళి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

## జయప్రకాశ్‌కు 'కళా మిత్రమండలి 'సత్కారం



నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) అధ్యక్షుడు, ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి అనుమల జయప్రకాశ్‌ను ఒంగోలులోని కళామిత్ర మండలి సంస్థ ఘనంగా సన్మానించింది. ఈనెల 24న ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో తెలుగు సాంస్కృతిక అకాడమి ఛైర్మెన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతులమీదుగా ఆయన ఈ సత్కారాన్ని అందుకున్నారు. సాహిత్యరంగానికి, పాత్రికేయ రంగానికి విశిష్టసేవలందిస్తూ ప్రముఖుల ప్రశంసలందుకుంటున్న జయప్రకాశ్‌ను ఈ సందర్భంగా నెల్లూరులోని సాహితీమిత్రులు, కళాభిమానులు అభినందించారు.

## విశ్రాంత ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం



దాదాపు 47 ఏళ్ల కిందట 1969-74 ప్రాంతాల్లో జిల్లాలోని విద్యానగర్‌లో ఉన్న శ్రీ భీమేశ్వర సంస్కృత ప్రాచ్య కళాశాలలో విద్వాన్ కోర్సు చదువుకున్న విద్యార్థులు ఇటీవల నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో సమావేశమై తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందించారు. ఈ పూర్వ విద్యార్థులంతా గతంలో నెల్లూరు, ప్రకాశం, చిత్తూరుజిల్లాలతోపాటు మద్రాసులోనూ పని చేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో ఉన్నతస్థాయిలో ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్స్‌గా పనిచేసి ఇప్పుడు విశ్రాంత జీవనం గడుపుతున్నారు. తామిప్పుడు పెద్దవారైనప్పటికీ అందరూ కలసి చిన్నప్పుడు చదువుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ చిన్నపిల్లల్లా సంతోషించారు. ఎంతో ఆత్మీయంగా నిర్వహించుకున్న ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు ఎం.సూర్యప్రకాశరావు, ఐ.మాధవరావు, జి.సుబ్బ రామయ్య, ఎం.వెంకటరెడ్డి, వి.అంకయ్య, ఎం.సూర్యప్రకాశరావు, సుబ్బారెడ్డి, ఎం. నర్సింహులు, ఎన్.సుబ్బ రామయ్య, కె.సుబ్బరామయ్య తదితరులున్నారు.

## డికెడబ్ల్యు, సర్వోదయ కాలేజీల్లో ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈనెల 25న నెల్లూరులోని డికె ప్రభుత్వ మహిళా కళాశాలలోని రాజనీతిశాస్త్ర విభాగం వారు విద్యార్థినులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్ మస్తానయ్య మాట్లాడుతూ 18 ఏళ్ళు నిండిన పౌరులంతా ఓటు కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకొని ఓటు హక్కును పొందాలన్నారు. అనంతరం ఓటుహక్కుపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులిచ్చారు. రాజనీతిశాస్త్ర విభాగాధిపతి కె.జోజి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని సర్వోదయ డిగ్రీ కాలేజీలో ఓటర్ల దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పోరేషన్ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం

సఫాయిమిత్ర-స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని నగరపాలక సంస్థ కార్మికులకు ఈనెల 24న ఉచిత వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన మందులు, మాత్రలు ఇచ్చారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశాలతో నగరంలోని పాత మునిసిపల్ ఆఫీసు ప్రాంగణంలో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రముఖ వైద్యులు రమణయ్య, సుబ్బారెడ్డి, కెఎస్ రాజు పాల్గొని పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు తదితర సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. కార్పొరేషన్ ఎస్ఇ సంజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇ.ఇ శేషగిరిరావు, చంద్రయ్య, ఖాదర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల ఫీజును ఫిబ్రవరి 11లోగా కట్టాలి

ఈ ఏడాది ఇంటర్ రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫిబ్రవరి 11వ తేది లోపు ఫీజు చెల్లించాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మాల్యాద్రిచౌదరి ఈనెల 25న ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు రూ.490, సైన్స్ విద్యార్థులు రూ.680 (థియరీకి 490, ప్రాక్టికల్స్‌కు 190), ఒకేషనల్ బ్రిడ్జి కోర్సులకు రూ.680 చెల్లించాలని, దరఖాస్తు ఫీజు రూ.10 అదనంగా ఉంటుందని తెలిపారు. ఇంటర్‌బోర్డు అనుమతి, హాజరు మినహాయింపు పొందిన విద్యార్థులకు కూడా ఇవే ఫీజులుంటాయని పేర్కొన్నారు.

## విద్యాలయాల్లో ఆనందోత్సాహాలతో.. జెండా పండుగ

జనవరి 26న 72వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అనేక విద్యాసంస్థల్లో గణతంత్ర వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఎంతో ఘనంగా నిర్వహించారు. విద్యాలయాల్లో మువ్వన్నెల పతాకాలను ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా దేశానికి అపూర్వమైన సేవలు చేసిన మహనీయులను, వారి త్యాగాలను అందరూ స్మరించుకున్నారు. దేశనాయకులను, దేశభక్తులను గుర్తుకు తెచ్చుకున్నారు. విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

### 'విపిఆర్ విద్య'లో...



నెల్లూరులో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని 'విపిఆర్ విద్య' ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో 72వ గణతంత్ర దినో త్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ.వి.నారాయణరెడ్డి తొలుత జెండా వందనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులంతా దేశభక్తి గీతాలను ఆలపించారు. తరగతుల వారీగా క్రమశిక్షణతో మార్చ్‌ఫాస్ట్ చేశారు. రిపబ్లిక్ డే విశిష్టతను తెలియజేస్తూ పలువురు విద్యార్థులు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో అనర్గళంగా ఉపన్యసించి అందరినీ ఆకట్టుకున్నారు. విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ వి.టి శ్రీనివాస్ గణతంత్ర దినోత్సవం విశిష్టతను తెలియజెప్తూ ఇది జాతీయ పండుగని, రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు.. మన దేశం లౌకికతత్వానికి ప్రతీకగా నిలిచిన రోజు కనుక ప్రతి రిపబ్లిక్ దినోత్సవం రోజును మన భారతీయులంతా ఒక పండుగరోజుగా జరుపుకుంటారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ వదాన్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో ఇలాంటి జాతీయ పండుగలను ఘనంగా నిర్వహించేట్లు చేసి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విపిఆర్ విద్యాసంస్థల ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులంతా పాల్గొన్నారు.

### 'ఎన్‌బికెఆర్'లో...



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన గణతంత్ర వేడుకల్లో తొలుత కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్‌సిసి క్యాడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మహనీయుల త్యాగాలను గుర్తుచేసుకుని ప్రతి ఒక్కరూ దేశసేవలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ గోవిందు మాధవయ్య, పీడీ వి.మల్లికార్జునరెడ్డితో పాటు ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'విశ్వసాయి'లో...



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి కాలేజీలో గణతంత్ర వేడుకలు కళాశాల ఛైర్మెన్ డా.ఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. ప్రతి విద్యార్థి దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయులను గుర్తుంచుకోవాలని, దేశంలోని ప్రతిభావంతులను మార్గదర్శకంగా తీసుకోవాలని కోరారు. వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'కృష్ణచైతన్య'లో...



నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కాలేజీలో గణతంత్ర వేడుకల్లో భాగంగా కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని జెండా వందనం చేశారు. కళాశాల ఎన్‌సిసి విభాగం వారు కవాతు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ వేడుకల్లో కళాశాల డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్స్ డా. ఎన్.కృష్ణకుమార్, ఎస్.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

### 'వేదవ్యాస'లో...



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని వేదవ్యాస స్కూల్‌లో జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్కూల్ కరెస్పాండెంట్ ఏపి బాలాజి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. మన రాజ్యాంగం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మహనీయులను స్మరించుకున్నారు. విద్యార్థులందరికీ మిఠాయిలు పంచారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. స్కూల్ డైరెక్టర్ ఏ.పి వేదగిరి తదితరులు పాల్గొన్నారు.

### 'నేతాజీ' స్కూల్‌లో...



నెల్లూరులోని నేతాజీ (ఎంఎస్‌ఆర్) పైలట్ హైస్కూల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు పాఠశాల కరెస్పాండెంట్ ఎంవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. తొలుత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. పాఠశాల డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మీదివ్యశ్రీ, హెడ్మాస్టర్ ఎస్‌విఎల్ నరసింహారావు, ఏ.ఓ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర వైభవం.. అంబరాన్నంటిన సంబరం

**_మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రతి పౌరుడి గుండె సగర్వంగా ఉప్పొంగింది. వాడవాడలా ఆనందోత్సాహాలతో గణతంత్ర వేడుకల సంబరం ఒక పండుగలా జరిగింది. నెల్లూరులో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయజెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. జెండా పండుగ విశిష్టతను మరోసారి అందరికీ వివరించి దేశభక్తిని చాటుకున్నారు. గణతంత్ర వేడుకలతో నెల్లూరుకు పండుగ కళ వచ్చింది._**

జనవరి 26న 72వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో జిల్లా అధికారయంత్రాంగం అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించింది. అంబరాన్నంటే సంబరాలతో ఉత్సవాలు అందరినీ అలరించాయి. దేశ నాయకులు, భరతమాత వేషధారణలు, విద్యార్థుల నృత్యాలు, సాహస విన్యాసాలు దేశభక్తిని చాటి అందరినీ ఉత్తేజపరిచాయి. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన వందమంది పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల్లో ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. విశిష్ట సేవలందిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్, డిఎం.రోజ్‌మాండ్, డిఎస్ఓ బాలకృష్ణారావు, జడ్పీ సిఇఓ సుశీల, డిఎం అండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి, నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాసకుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ విజయమోహన్, డిఎఫ్ఓ షణ్ముఖకుమార్, డిఎస్‌డిఓ యతిరాజ్, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి అబ్దుల్ హమీద్, జైళ్ళశాఖ సూపరింటెండెంట్ నారాయణాచార్యులు, డిఎస్పీ కాంతారాజ్, కార్పొరేషన్ ఇఇ సంజయ్, పబ్లిక్‌హెల్త్ ఇంజనీర్ తిరుపతి రావు, ఐఐసి డిజిఎం సుబ్బారావు, జిజిహెచ్ ఏ.ఓ కళారాణి, ఏపిఎంఐపి పీడీ పి.ఎం సుభాని, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ టి.చంద్రశేఖర్, జిల్లా మలేరియా



అధికారిణి పి.మనోరమ, చేనేత జౌళిశాఖ ఏ.డి ఉమామహేశ్వరి, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి ప్రసాద్, నాయుడుపేట ఆర్డీఓ సరోజిని, సిఎంఓ అమరేంద్రనాథ్ రెడ్డి, ఎడిమాలజిస్ట్ డాక్టర్ అబ్దుల్ మొయిన్, మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులంతా అవార్డులందుకున్నవారిలో ఉన్నారు. అన్నిశాఖల్లో కలిపి 392 మంది ఈ అవార్డులను అందుకున్నారు. ప్రత్యేకించి జిల్లా వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తూ విశిష్టసేవలందిస్తున్న వైద్యులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులు 56మంది సేవలను కొనియాడుతూ వారందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు.

### కలెక్టరేట్ ప్రాంగణంలో...

నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, జాయింట్ కలెక్టర్లు హరేందిరప్రసాద్, డాక్టర్ ఎన్ ప్రభాకర్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. 136 కోట్ల జనాభా ఉన్న మనదేశంలో ప్రజలంతా ప్రజాస్వామ్యయుతంగా ముందుకు సాగుతుండడం విశేషమని, మన రాజ్యాంగం మనకెంతో గర్వకారణమని కలెక్టర్ అన్నారు.

## అట్టడుగు వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు

**- జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



రిపబ్లిక్ డే వేడుకల ప్రసంగంలో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వం అన్నివిధాల చేయూత నందిస్తోందని, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అన్నారు. జిల్లాలో 16,460 మంది వాలంటీర్లను నియమించి ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. మరోవైపు అనేక పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పనకు కృషిచేస్తున్నామన్నారు. ప్రతి రైతు కుటుంబాన్ని ఆదుకుంటూ వారికి పెట్టుబడి సాయం కింద 13,500రూపాయల వంతున ఇప్పటికే రెండుసార్లు 2.43 లక్షల మందికి సాయం అందించామన్నారు. జిల్లాలో కరోనా మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొన్నామని, మొత్తం 63,857 మందికి కోవిడ్ వైరస్ సోకితే అందరికీ సకాలంలో వైద్యచికిత్సలందించడంతో అత్యధికశాతం మంది కోలుకున్నారని, రికవరీ రేటు 98.94 శాతంతో, కోవిడ్ రికవరీలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందని తెలిపారు. జిల్లా ప్రగతిని ఆయన వివరిస్తూ జిల్లాలోని సంగం, నెల్లూరు బ్యారేజీలతో పాటు ఆల్తూరుపాడు వద్ద రిజర్వాయర్‌ను కూడా త్వరలోనే నిర్మించడం జరుగుతుం దన్నారు. కొడవలూరు మండలంలో మిథాని, గ్రీన్‌లామ్, క్రిబ్‌కో, కాంకర్ తదితర పరిశ్రమలతో పాటు కృష్ణపట్నం పోర్టు కారిడార్ ద్వారా లక్షలాదిమందికి ఉపాధి దొరుకుంతుందని చెప్పారు. కావలి వద్ద మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుచేసి పాతికవేల మందికి ఉపాధి కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. జిల్లాలోని దాదాపు 3.68లక్షల మందికి ప్రతినెలా 1వతేదిన 90.50కోట్ల రూపాయలు పింఛన్‌గా ఇస్తున్నామని, 1477 లేఅవుట్లు ఏర్పాటుచేసి 1,73,816 మందికి ఇళ్ళపట్టాలు అందించామని, కొత్తగా 256 లేఅవుట్లలో 53,958 ఇళ్ళను మంజూరు చేశామని, ఆత్మకూరు వద్ద ఎంఎస్ఎంఇ పార్కును సుందర నందనవనంగా ఏర్పాటుచేస్తామని, నెల్లూరులో పాతిక కోట్ల రూపాయలతో స్టెమ్‌పార్కును నెలకొల్పేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రత్యేక పోలీసు దళం, నావెల్ బృందాలు కవాతు నిర్వహించాయి. యాంటీ నక్సల్‌స్క్వాడ్‌ల సాహస పోరాటాల ప్రదర్శనలు, సంక్షేమ శకటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీసు జాగిలాల వినూత్న ప్రదర్శనలు అందరకీ ఆశ్చర్యం కలిగించాయి.

## విశిష్ట సేవలకు గణతంత్ర పురస్కారాలు



జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు నుండి సాహితీ రంగంలో విశిష్ట పురస్కారాన్నందుకున్న ప్రముఖ సాహితీవేత్త, అవధాని కోట రాజశేఖర్



కార్పొరేషన్ కమిషనర్ దినేశ్‌కుమార్ చేతులమీదుగా విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకుంటున్న డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి పి.మల్లిఖార్జునరావు



జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు నుండి నాటక రంగంలో విశిష్ట పురస్కారాన్నందుకున్న రంగస్థల నటుడు తిరుపతి హరగోపాల్

గణతంత్ర వైభవాన్ని చాటుతూ 26వ తేది సాయంత్రం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన సాంస్కృతిక వేడుకలు కన్నులపండువగా జరిగాయి. కళాకారులు దేశభక్తిని చాటే నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చేతులమీదుగా జ్ఞాపికలు అందుకున్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురికి ఈ సందర్భంగా గణతంత్ర పురస్కారాలను అందజేశారు. కూచిపూడి నాట్యవిభాగంలో ఎంవి రమణయ్య, హరికథాగానంలో పరాయతం నారాయణరావు, సేవారంగంలో ఆర్‌టి వసంత, నృత్యరంగంలో రాజు, అవధానంలో కోట రాజశేఖర్, వేణుగానంలో పిఎస్ఆర్ ఆంజనేయులు, డోలు వాద్యంలో ఎం.దక్షిణామూర్తి, మేకప్ రంగంలో ఎం.సుధాకర్‌రెడ్డి, నాటకరంగంలో తిరుపతి హరగోపాల్, చిత్రలేఖనంలో బి.కళాసాగర్‌లకు పురస్కారాలను అందజేసి సత్కరించారు.

## ఆడబిడ్డ అంటే.. ఇంటికి మహాలక్ష్మి



మహిళా ప్రాంగణంలో మొక్కను నాటుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఆడబిడ్డ అంటే ఇంటికి మహాలక్ష్మి అని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆడపిల్లను మహాలక్ష్మిలాగా చూసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈనెల 24న అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని మహిళా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుంటూ ప్రతిభతో రాణిస్తున్నారని, బాలికలందరూ బాగా చదువుకుని సమాజంలో ఉన్నతస్థాయిలో జీవించాలన్నారు. బడికి దూరంగా ఉన్న బాలికలను గుర్తించి హాస్టళ్ళలో చేర్పించాలని అధికారులకు సూచించారు. బాల్య వివాహాలు, బాలికలపై వేధింపులు నేరమని, ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా కఠినమైన చర్యలుంటాయని హెచ్చరించారు. 'ఆడపిల్లలను బతకనిద్దాం..ఆడపిల్లలను చదవనిద్దాం'..అంటూ అందరిచేత ప్రమాణం చేయించారు. అనంతరం మహిళా ప్రాంగణంలో మొక్కను నాటారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ఇన్‌చార్జి పీడీ ఉమాదేవి, ఛైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సిడిపిఓ సత్యకుమారి, సేవాసదనం అధికారి కె.మాధవి పాల్గొన్నారు.




# అభివృద్ధిలో పరుగులు పెడుతున్న శ్రీసిటీ

## - కొనియాడిన ఏపిఐఐసి ఎం.డి కె.రవీన్‌కుమార్‌రెడ్డి




శ్రీసిటీలో ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలున్నాయని, ఇక్కడ వ్యాపార పురోభివృద్ధి ఎంతో బావుందని, అభివృద్ధిలో పరుగులు పెడుతున్న శ్రీసిటీని సందర్శించడం తనకెంతో ఆనందంగా ఉందని రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపిఐఐసి) వైస్ ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.రవీన్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 24న ఆయన శ్రీసిటీని సందర్శించి శ్రీసిటీ పురోగతి చూసి సంతోషపడ్డారు. ఏపిఐఐసి వైస్‌ఛైర్మెన్‌గా, ఎం.డిగా రవీన్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన ఈనెల 24న శ్రీసిటీకి రావడం విశేషం. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీ నిర్మాణం సమయంలో రవీన్‌కుమార్ ఇచ్చిన సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. రవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు 190 పరిశ్రమలు శ్రీసిటీలో ఉండడం, వాటిలో 50 వేలమందికి పైగానే జీవనోపాధి పొందుతుండడం తనకెంతో ఆనందంగా ఉందని, మరిన్ని పెట్టుబడులు రావడానికి శ్రీసిటీకి సహకారం అందిస్తామని రవీన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో జపాన్ ఎలక్ట్రికల్ పరికరాల తయారీసంస్థ, ప్రైమ్ మీడియన్ లిమిటెడ్ ఎం.డి కజుమీ ఇకారషి, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ ఐఎల్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

# బిటెక్ సీట్ల భర్తీలో ఎన్‌బికెఆర్ ఫస్ట్




- కళాశాల డైరెక్టర్ డా. విజయకుమార్

ఈ విద్యాసంవత్సరంలో బిటెక్ మొదటి సంవత్సరంలో రెండవ కౌన్సిలింగ్ ద్వారా 673 సీట్లతో కోట మండలంలోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి కళాశాల జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది. తొలిదశ కంటే రెండవదశలో ఎక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా.విజయకుమార్‌రెడ్డి ఈనెల 26న విలేకర్లతో మాట్లాడుతూ మంచి ర్యాంకులు కలిగిన విద్యార్థులు తమ కళాశాలను ఎంచుకోవడం విశేషమని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసినందువల్ల విద్యార్థులు వెంటనే తమ కళాశాలలో చేరి తరగతులకు హాజరు కావాలని కోరారు. మేనేజ్‌మెంట్ కోటాలో సిఎస్‌ఇ, ఏఐడి బ్రాంచ్‌లలో మినహా మిగిలిన బ్రాంచ్‌లలో కొద్దిగా సీట్లు మిగిలి ఉన్నాయని, కౌన్సిలింగ్ ద్వారా సీట్లు పొందలేకపోయినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. కళాశాలలో చేరిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారని ఆయన వివరించారు.

# బొగ్గరపు కవితకు ప్రథమ బహుమతి



విజయవాడలోని 'సెంటర్ ఫర్ ఇంటిగ్రల్ స్పిరిట్' అనే సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జాతీయవాద రచనా పోటీల్లో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి 'రామరాజ్య నిర్మాణానికై' అనే శీర్షికతో రచించిన కవిత ప్రథమ బహుమతి సాధించింది. 'భారతీయతకు విజయకేతనం రామజన్మభూమి తీర్పు' అనే విషయంపై ఆ సంస్థ నిర్వహించిన ఈ పోటీల్లో జూమ్‌మీటింగ్ ద్వారా రాధాకృష్ణమూర్తి పాల్గొని తన కవితను చదివి వినిపించారు. కవితల పోటీల్లో విజేతగా నిలిచిన బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని నెల్లూరు సాహితీవేత్తలు చిన్ని నారాయణరావు, డా.గంగిశెట్టి శివకుమార్ తదితరులు అభినందించారు.






# గూడూరు డివిజన్ వార్తలు

## ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు



గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి గ్రౌండ్‌లో ఈనెల 26న రిపబ్లిక్ డే వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ జాతీయజెండాను ఆవిష్కరించి వందనం చేశారు. విధుల నిర్వహణలో ప్రతిభ కనబరుస్తూ ఉత్తమ సేవలందిస్తున్న పలుశాఖల ఉద్యోగులను అభినందించి వారికి ప్రతిభా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ వేడుకలలో గూడూరు డిఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మార్వో బి.లీలారాణి, ఎంపిడిఓ నాగమణి, రవాణాశాఖ అధికారి మురళీ మోహన్, వెంకటగిరి ఎమ్మార్వో నిరంజన్, గూడూరు ఎస్ఎఫ్ఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



జనవరి 26వ తేదీ నెల్లూరులో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్‌ల చేతులమీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకుంటున్న గూడూరు రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, గూడూరు టౌన్ సిఐ దశరథరామారావు, 1వ పట్టణ ఎస్.ఐ సైదులు

## మోదుగవనంలో.. 29న మహాగణపతి హోమం



గూడూరు రెండవ పట్టణ పరిధిలోని మోదుగ వనంలో వెలసివున్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ, నూతన ఆలయ ప్రతిష్ట ఇటీవల జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి గత 48 రోజులుగా మండలాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 29న ఉదయం 8 గంటల నుంచి స్వామివారికి అభిషేకం, ఆ తర్వాత మహాగణపతి హోమం జరుగుతుందని, బుడంగుంట రవికుమార్‌రెడ్డి దంపతులు, మెట్టా రాధాకృష్ణారెడ్డి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరిస్తున్నారని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## విద్యార్థులు పోటీతత్వం కలిగి ఉండాలి



విద్యార్థులు పోటీతత్వం కలిగి చదువులో ఉన్నతంగా రాణించాలనే మంచి ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపస్మా) గూడూరు నియోజకవర్గం ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఇటీవల ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ పేరుతో పాఠశాల స్థాయి పరీక్ష నిర్వహించి వారిలో టాపర్‌లుగా వచ్చిన వారిని ఎంపిక చేసి గూడూరు నియోజకవర్గంలోని పాఠశాలలన్నింటికి కలిపి స్థానిక రోటరీ భవన్‌లో నియోజకవర్గ స్థాయి పరీక్ష నిర్వహించారు. ఈ ప్రతిభా పరీక్షలో విజేతలుగా ప్రతి స్కూల్ నుండి ఇద్దరిని ఎంపికచేసి జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షకు పంపనున్నారని అపస్మా గూడూరు నియోజకవర్గ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌రెడ్డి తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణలో అపస్మా జిల్లా ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, రాష్ట్ర సలహాదారు బి.దశరథరామిరెడ్డి, గూడూరు సెక్రటరి ఎన్.బాలకృష్ణంరాజు, ఎన్.సంజీవరాజు పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ పోటీలు



గూడూరు పట్టణంలోని అల్లూరి ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీలకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, పోలీసులు, పలు స్వచ్ఛంధ సంస్థల జట్లు పాల్గొని హోరాహోరీగా పోటీ పడగా చివరకు ప్రింట్ మీడియా జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా రోటరీ క్లబ్ నిలిచింది. గెలుపొందిన జట్లకు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

## ఏపివిఆర్‌ఓస్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఈ నెల 23వ తేదీ గూడూరు సబ్‌కలెక్టర్ ఆఫీసులో ఏపివిఆర్‌ఓస్ గ్రేడ్-2 అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, పక్కన అసోసియేషన్ నెల్లూరుజిల్లా అధ్యక్షుడు మేరగ రమేష్, ప్రధానకార్యదర్శి వంగిపూడి సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ ఉరుటూరు సురేష్, ఉపాధ్యక్షుడు మహిధర్, సాజిద్ తదితరులు

హ్యాట్సాఫ్!

# గురువుల మాటలను నిలబెడుతున్న.. పూర్వ విద్యార్థులు

## • చదువులను, జీవితాలను సార్థకం చేసుకుంటున్నారు

***అన్నం పెట్టిన చెయ్యిని, చదువు చెప్పిన గురువుల్ని ఎప్పటికీ మరచిపోకూడదన్నది పెద్దల మాట. ఆ మాటలను అక్షరాలా పాటిస్తూ అనేక విద్యాలయాల పూర్వవిద్యార్థులు తమ గురువులు చెప్పినట్లుగా సన్మార్గంలో నడుచుకుంటూ జీవితంలో రాణిస్తున్నారు. కన్నవారిని, పుట్టిన ఊరిని మరువకూడదని, దేశభక్తితో-దైవభక్తితో జీవించాలని, నీతిగా నిజాయితీగా ఉంటూ మానవత్వంతో బతకాలని, బాగా చదువుకుని అభివృద్ధిలోకి వచ్చి తమకు తమ కుటుంబాలకే కాక, సమాజానికి కూడా చేతనైనంత సాయం చేయాలని.. ముఖ్యంగా ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవాలని.. ఇలా చిన్నతనంలో తమకు గురువులు చెప్పిన మాటలను శ్రద్ధతో ఆచరిస్తూ అనేకమంది పూర్వవిద్యార్థులు తమ చదువులను, జీవితాలను సార్థకం చేసుకుంటున్నారు. మానవీయ దృక్పథంతో సేవామార్గం ఎంచుకుని జిల్లాలోని అనేకప్రాంతాల్లోని పూర్వవిద్యార్థులు ఇటీవల కాలంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశాలు, వారు చేస్తున్న కార్యక్రమాలు సమాజానికి మార్గదర్శకంగా ఉంటూ అందరినీ బాగా ఆకట్టుకుంటున్నాయి.***

జిల్లాలోని అనేక పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఇప్పుడు పెద్దవారై వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిల్లో ఉంటున్నప్పటికీ..తాము చిన్నతనంలో చదువుకున్న బడుల్లో స్నేహితాలను, ఆ ఆత్మీయతలను మరచిపోకుండా, చిన్ననాటి జ్ఞాపకాలను మధురస్మృతులుగా మనసుల్లో పదిలం చేసుకుని, ఇప్పుడు ఆ బడులకే వచ్చి అందరితో ఆత్మీయతను పంచుకుంటున్నారు. 'స్నేహ బంధమూ..ఎంత మధురమూ' అంటూ చిన్ననాటి స్నేహితుల్ని కలుసుకుని ఆనందించడమే కాక, తాము చదువుకున్న విద్యాలయాల అభివృద్ధికి, సమాజానికి తమ చేతనైనంత సేవచేస్తూ విద్యార్థిలోకానికే ఆదర్శంగా ఉంటూ... 'హ్యాట్సాఫ్' అనిపించుకుంటున్నారు.

## ఆపదలో ఉన్న స్నేహితుడిని ఆదుకున్నారు



జిల్లాలోని చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 6 నుంచి 10వ తరగతి దాకా చదువుకున్న పూర్వ విద్యార్థులు ఇటీవల ఆ బడిలోనే ఆత్మీయ సమావేశం జరుపుకున్నారు. అయితే, తమ మిత్రుడు విజయశంకర్ ఈ కార్యక్రమానికి రాకపోవడంతో విజయశంకర్‌కు ఏమైందా అనుకుంటూ ఆయన స్వగ్రామమైన గోనుపల్లికి వెళ్ళారు. విజయశంకర్‌కు కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి ఒక కాలుకు బాగా దెబ్బతగలడంతో ఆ కాలును తొలగించాల్సి వచ్చిందని, మరోవైపు ఆర్థికంగా కూడా ఇబ్బందుల్లో ఉన్నాడని తెలిసి అందరి హృదయాలు ద్రవించిపోయాయి. అంతే, మిత్రులంతా కలసి ఆయనకు 75వేల రూపాయలు సాయం అందించారు. ఇంకా ఎప్పుడు ఎంత కావాల్సి ఉన్నా తామంతా ఉన్నామని, దిగులుపడ వద్దని భరోసా ఇచ్చి వచ్చారు. పూర్వ విద్యార్థులు షేక్ షిరాజుద్దీన్, నాగిరెడ్డి, మల్లవరపు మధుసూదన్‌రెడ్డి, బొడ్డు ఉదయ్‌భాస్కర్, రాఘవేంద్ర, పెంచలనరసయ్యనాయుడు, బాషా, కామేశ్వరరావు, జి.పెంచలయ్య ఈ సేవలో పాలుపంచుకుని చిన్ననాటి మిత్రుణ్ణి మానవతా హృదయంతో ఆదుకుని అందరి అభినందనలు అందుకున్నారు.

## మూసివున్న బడిని తిరిగి తెరిపించారు

జిల్లాలోని తడ మండలంలో ఉన్న రామాపురం కుప్పం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆరేళ్ళ క్రితం మూత పడింది. ఆ బడిలో అప్పుడు కేవలం 14 మంది విద్యార్థులే ఉండడంతో బడి మూసేసి పక్కనే ఉన్న మరో గ్రామంలో దాన్ని విలీనం చేశారు. దీంతో పూర్వ విద్యార్థులు ఎలాగైనా సరే పాఠశాలను రామాపురం కుప్పంలోనే ఏర్పాటు చేయించాలని సంకల్పించి, పాఠశాల ఉపాధ్యాయుడితో కలసి, గ్రామస్తులందరినీ కూడగట్టారు. ఇప్పుడు ఈ ఊరికి చెందిన విద్యార్థులు 30 మంది దాకా ఉండడంతో బడిని ఇక్కడే పెట్టాలని అధికారులకు విన్నవించారు. అందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు సమ్మతించారు. దీంతో ఇప్పుడు ఆ బడిలో చదువుకుంటున్న విద్యార్థుల బాధలు తీరాయి. పూర్వవిద్యార్థుల కృషితో ఈనెల 17వ తేది నుంచి రామాపురం కుప్పం బడి ప్రారంభమైంది.

బడిని తిరిగి తెరిపించేందుకు సహకరించిన ఇన్‌చార్జి ఎంఇఓ శ్రీనివాసరావుకు విద్యార్థులంతా తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

## గురువులను సన్మానించుకున్నారు :



వెంకటగిరిలోని ఆర్‌విఎం ఉన్నతపాఠశాలలో 1993-94లో చదువుకున్న విద్యార్థులు ఈనెల 24న పాఠశాలకు వచ్చి సమావేశమయ్యారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులంతా కలసి సన్మానించుకుని తమ కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటగిరి రాజకుటుంబీకుడు, ఎస్వీబిసి ఛైర్మెన్ సాయికృష్ణయాచేంద్ర మాట్లాడుతూ తమకు చదువు చెప్పిన గురువులను గుర్తుపెట్టుకుని విద్యార్థులు వారిని సత్కరించడం ఒక మంచి సంప్రదాయమని, ఇది తనకెంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా యాచేంద్రతో పాటు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుధాకర్, రాఘవయ్య, మీనయ్య తదితరులందరినీ పూర్వవిద్యార్థులు అడపాల గోపి, జంపాల ప్రకాష్, సురేష్, చెంజి శ్రీనివాసులు తదితరులంతా కలసి ఘనంగా సన్మానించారు.

## ఎంతోమందికి ఉపాధి చూపుతున్నారు :

కావలిలోని డిబిఎస్ కాలేజీలో 2009-12 బ్యాచ్‌కి చెందిన మెకానికల్ విభాగం విద్యార్థులెంతోమంది ఇప్పుడు మంచి ఉద్యోగాల్లో రాణిస్తూ అనేకమందికి ఉపాధి కల్పిస్తూ అందరికీ మార్గదర్శకులవుతున్నారు. ఈనెల 24న వారంతా కళాశాలలో ఆత్మీయ సమావేశం జరుపుకున్నారు. తమ జీవితాలకు బాటలు వేసిన గురువులకు మనసారా కృతజ్ఞతలు చెప్పుకున్నారు. కాలేజీ సెక్రటరీ డా. దామిశెట్టి బాలసురేష్‌బాబు, కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ టివి రావు, జి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

## సమాజసేవ చేయాలని నిర్ణయించుకున్నారు :

జిల్లాలోని రాపూరులో ఉన్న శ్రీ సివికె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93లో 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఈ నెల 17న కలుసుకుని ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు వివిధ రంగాల్లో ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటున్న సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని తమ కుటుంబాల్లో ఎవరికి ఎలాంటి ఇబ్బందులున్నా అందరం కలిసి ఆదుకుందామని నిర్ణయించుకున్నారు. ఇకనుంచి తాము చేయబోయే సేవా కార్యక్రమాలన్నిటిని పర్యవేక్షించేందుకు తమలో ఒకరైన పి. శ్రీహరిబాబును, వసంతరావును కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా, సయ్యద్ సిరాజ్ అహ్మద్‌ను కోశాధికారిగా నియమించుకున్నారు.

# కష్టాలు కడతేర్చి.. కోర్కెలు నెరవేర్చే.. కనుపూరు ముత్యాలమ్మ

***త్రిశక్తి స్వరూపిణిగా, ముగ్గురమ్మల మూలపుటమ్మగా, మహిమాన్విత శక్తి దేవతగా ముత్యాలమ్మ అమ్మవారు ప్రతీతి. పిలిస్తే పలికే చల్లనితల్లిగా, కష్టాలు కడతేర్చి కోరిన కోర్కెలు నెరవేర్చే దేవతగా ముత్యాలమ్మ తల్లి ప్రసిద్ధి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని చిల్లకూరు మండలంలో కనుపూరు గ్రామదేవతగా వెలసి ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఎంతోకాలంగా భక్తుల పూజలందుకుంటూ ఉంది. దశాబ్దాలనాటి చరిత్ర ఉన్న ఈ ఆలయం ఎంతో మహిమ గల శక్తి దేవాలయంగా జిల్లాలో ఖ్యాతి పొందుతూ ఉంది.***

సృష్టికి మూలమైన ఆ జగన్మాతకు ఎన్నో రూపాలు, మరెన్నో పేర్లు ఉన్నాయి. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో గ్రామశక్తులుగా అనేక రూపాలతో వెలసిన అమ్మవార్లను అనేకపేర్లతో భక్తితో కొలుచుకుంటూ ఉంటారు. అలా.. మహాశక్తి స్వరూపిణిగా అవతరించిన ఆ జగన్మాత రూపమే.. జిల్లాలోని కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారు. కరుణామయి అయిన ముత్యాలమ్మ అమ్మవారిని భక్తితో కొలుచుకుంటే అన్ని కష్టాలు సమసిపోతాయని, అమ్మవారి కృపతో ఎంతటి ఆపదలైనా తొలగి పోతాయని, ఎలాంటి రోగాలైనా, మానసిక రుగ్మతలైనా ఇట్టే మటుమాయమైపోతాయని ప్రతీతి. సాధారణ రోజుల్తో పాటు అమ్మవారికి ప్రీతిపాత్రమైన ప్రతి మంగళవారం, ఆదివారం రోజుల్లో భక్తులు పెద్దసంఖ్యలో కనుపూరుకు తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకుంటారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కుబడులు తీర్చుకుంటూ ఉంటారు.

## పుట్ట శిలగా ఆవిర్భవించిన అమ్మవారు :

అమ్మవారు తొలుత ఎన్నో దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలోని ఒక పుట్టలో శిలారూపంలో ఆవిర్భవించినట్లు పెద్దలు చెప్తుంటారు. అలా కనిపించిన ఆ అమ్మవారి మూర్తి ఎంతో మహిమాన్వితమైన గ్రామశక్తిగా గుర్తించి గ్రామస్తులు ఓ చిన్న





మన దేవాలయాలు 31

కుటీరంలాంటి గుడిలో పెట్టి ముత్యాలమ్మ అమ్మవారుగా ఆరాధిస్తూ వచ్చారు. ఆ తర్వాత కొన్నేళ్ళకి గ్రామస్తులు, భక్తులందరు కలసి 1980 ప్రాంతంలో అమ్మవారి నూతన బింబాన్ని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. ఆ తర్వాత 1984లో ఈ ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి రావడం, 1999లో ఆలయ జీర్ణోద్ధరణ జరిగి అత్యంత వైభవంగా మహాకుంభాభిషేకం నిర్వహించడం జరిగాయి.

## అయిదంతస్తుల రాజగోపురం :

అమ్మవారి ఆలయానికి అత్యద్భుతమైన రీతిలో నిర్మితమైన అయిదంతస్తుల రాజగోపురం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటుంది. గర్భాలయంలో కొలువై ఉన్న అమ్మవారు దుష్టశిక్షణకు ప్రతీకగా, శిష్టరక్షణకు పతాకగా వెలసి మరింత తేజస్సుతో విరాజిల్లుతూ ఉంటుంది. అమ్మవారిని భక్తితో కొలిచేవారికి యమయాతనలు, నరకబాధలు సైతం తప్పిపోతాయని కూడా ప్రతీతి. అమ్మవారి వాహనమైన సింహం..శిలావిగ్రహంగా మలచబడి ఆ పరాశక్తి పరాక్రమానికి ప్రతీకగా తేజరిల్లుతూ ఉంటుంది. ఆలయ ముఖమండపంలోని 'త్రిశూలం' అమ్మవారి మహిమాన్విత శక్తికి నిదర్శనంగా నిలచి ఉంటుంది. భక్తులు ఈ త్రిశూలానికి నిమ్మకాయల దండలు వేసి భక్తితో పూజలు చేస్తుంటారు. ఆలయమంతటా అపూర్వమైన శిల్పసౌందర్యంతో నిర్మించిన స్తంభాలు, ఆలయ ప్రాకారమండపంపై చెక్కిన అమ్మవార్ల శక్తి స్వరూపాలు భక్తులను మరింతగా భక్తిభావ సమన్వితులను చేస్తుంటాయి. ఆలయ ప్రాంగణంలోని అశ్వత్థ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రతీతి. అందుకే భక్తులు, ముఖ్యంగా మహిళా భక్తులు ఈ దేవతావృక్షతం చుట్టూతా ప్రదక్షిణలు చేసి మొక్కులు మొక్కుకుంటుంటారు.

## అంగరంగ వైభవంగా జాతర :

ప్రతి ఏటా ఉగాదికి ముందుగా వచ్చే మంగళవారం అమ్మవారి జాతర అంగరంగవైభవంగా ఉంటుంది. విద్యుద్దీపాలంకరణలతో ఆలయం శోభాయమానంగా ఉంటుంది. జిల్లా నుంచే కాక రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటూ ఉంటారు. జాతరలో భాగంగా తొలుత పోలేరమ్మ అమ్మవారికి పూజలు చేస్తారు. అనంతరం ఎంతో విశిష్టమైన రీతిలో 'యార' ఉత్సవం నిర్వహిస్తారు. ఆలయంలోని దేవతా మూర్తులందరికీ ప్రత్యేకపూజలు, సేవలు చేస్తారు. సర్వ శుభప్రదాయిని.. సకలాభీష్ట ప్రదాయిని అయిన ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులతో జాతర జరిగే రోజుల్లో తూర్పు కనుపూరు గ్రామం భక్తజనసందోహంతో నిండిపోతుంది.

# కొందరివల్లే కొంప మునుగుతోందా

(మొదటి పేజీ తరువాయి)

మొదటిసారిగా కరోనాని కారణంగా చూపి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎన్నికలు వాయిదా వేసినప్పుడే ప్రభుత్వం సంయమనం పాటించివుండాలి. సాక్షాత్తూ ముఖ్యమంత్రే మీడియా ముందుకు వచ్చి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి కులం, వర్గం అంటగట్టి నేరుగా విమర్శించడంతో సమస్య మరింత జటిలం అయ్యింది. ఆరోజే ప్రధాన కార్యదర్శినో లేక పార్టీలోని ఇతర పెద్దలనో రమేష్‌కుమార్ వద్దకు పంపించి ఎన్నికలు నిర్వహించుకోవడం కోసం సామరస్యంగా చర్చలు జరిపి ఉండివుంటే సమస్య ఇంత దూరం వచ్చి ఉండేది కాదన్నది విశ్లేషకుల అభిప్రాయం. విశేష జనాదరణతో 175కి గాను 151 సీట్లు సాధించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలోపే పని చేయడానికి తెలివిగల వాళ్ళెవరూ సాహసించరు. ముఖ్యంగా అధికారులు అసలు ధైర్యం చెయ్యరు. ఈ క్రమంలో నిమ్మగడ్డను కూడా తమ లైన్‌లో పెట్టుకోవడానికి ప్రయత్నాలు జరిగివుంటే ఆ ప్రయత్నం తప్పక ఫలించి ఉండేది. అలాకాకుండా ముఖ్యమంత్రే నేరుగా ధ్వజమెత్తడంతో అంబటి లాంటి ఆయన సైన్యం రెచ్చిపోయి సమస్యను జటిలం చేసిపెట్టారు. ముఖ్య మంత్రే మాట్లాడాడు ఇంక మనం మాట్లా డకపోతే ఎలా అన్నట్లుగా అందరూ పోటీ పడి రమేష్‌కుమార్‌పై వ్యక్తిగత దూషణలకి దిగారు. ఇలా వరుస తప్పులతో పలసనైపోయారు.

## అప్పుడైనా మారుండాలి...

నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ని తొలగించి ఆయన స్థానంలో కనకరాజుని తెచ్చి పెట్టారు. నిమ్మగడ్డ న్యాయస్థానాన్ని ఆశ్రయించి మళ్ళీ తిరిగి వచ్చి ఆయన స్థానంలో కూర్చున్నాడు. రాజ్యాంగ వ్యవస్థ కోసం పనిచేసే అధికారిని తొలగిస్తే వచ్చే న్యాయపరమైన చిక్కులను కూడా అధ్యయనం చేయలేని అధికారులు, న్యాయ నిపుణులు ముఖ్యమంత్రి చుట్టూ ఉన్నారా...? అన్న అనుమానం ఇక్కడ సామాన్యుడికి సైతం కలుగుతోంది. ప్రభుత్వానికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కనగరాజు సీట్లో మళ్ళీ నిమ్మగడ్డ కూర్చున్నాడు. ప్రభుత్వం కనీసం అప్పుడైనా వ్యూహాత్మకంగా వ్యవహరించివుంటే బాగుండేది. అక్కడా తప్పిదం జరిగిపోయింది. ఒకవైపు రాజ్యాంగ పదవులకున్న సర్వాధికారాలను విస్మరించి, మరోవైపు న్యాయవ్యవస్థతోనే నేరుగా మనం ఢీకొంటున్నాం అన్న విషయాన్ని కూడా మర్చిపోయి పదే పదే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్ణయాలని వ్యతిరేకిస్తూ సమస్యను మరింత ముదరబెట్టారు.

అంతకుముందు నిజంగా నిమ్మగడ్డ చంద్రబాబుకి విధేయుడా కాదా అన్న విషయం పక్కనపెడితే, ఈ పూర్తి వ్యవహారంలో చంద్రబాబు నిమ్మగడ్డను సొంతం చేసుకున్నాడు. శత్రువుకి శత్రువు తనకి మిత్రుడన్నట్లుగా నిమ్మగడ్డ కూడా కసిగా పచ్చ బ్యాచ్‌తో దోస్తీ కట్టేశాడు. అందుకే కరోనా సాకుతో మధ్యలో ఆపేసిన జడ్పీ ఎన్నికలను పక్కనపెట్టి పంచాయతీ ఎన్నికలకు ముందు తెర లేపాడు. ఈ ఎన్నికల ద్వారా గ్రామాలలో వర్గ విభేదాలకు ఆజ్యం పోసి తద్వారా జడ్పీ ఎన్నికలలో కూడా వైసిపికి నష్టం చేయాలన్నది ఆయన వ్యూహం.

## కోర్టుల్లోనూ విఫలమే ...

పంచాయతీ ఎన్నికల విషయానికొస్తే, ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత సింగిల్ బెంచ్ ఆ నోటిఫికేషన్‌ని రద్దు చేసిన వెంటనే ప్రభుత్వం రిలాక్స్ అయినట్లుగా స్పష్టమవుతోంది. ఇంతటి స్థాయిలో ప్రభుత్వంపై పట్టు సాధించాలని పంతం పట్టి కూర్చున్న నిమ్మగడ్డ విషయాన్ని అంత తేలిగ్గా వదిలిపెడతాడని భావించడం అధికారుల నిర్లక్ష్యమే. ఇక హైకోర్టు క్రింది కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ, ఎన్నికలకు వెళ్లాల్సిందేనంటూ ఇచ్చిన ఆదేశాల అనంతరం కూడా పార్టీ శ్రేణులు మేల్కొనకపోవడం దురదృష్టకరమని రాజకీయ మేధావుల అభిప్రాయం. తప్పుల తడకగా కేసు ఫైల్‌చేసి కోర్టు తిప్పిపంపించే స్థాయిలో ముఖ్యమంత్రి పేషీ నిర్లక్ష్యధోరణిని ప్రదర్శించడం అత్యంత బాధాకరమైన అంశంగా వైసిపి శ్రేణులు సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వ్యవహారంలో సుప్రీం కోర్టు గతంలో ఎప్పుడు కూడా ప్రభుత్వాలకు అనుకూలంగా తీర్పులిచ్చిన దాఖలాలు లేవు. గతానుభవాలను, పాత తీర్పులను కూడా అధికారులు తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేకపోవడం శోచనీయం.

## ఆంధ్రా ప్రకటనలో తెలంగాణ పంచాయతీ ఫోటో...

ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను వివరిస్తూ జనవరి 27వ తేదీ బుధవారం నాడు ఆంధ్రా ప్రభుత్వం కొన్ని దిన పత్రికలలో ప్రకటన ఇచ్చింది. ఆ ప్రకటనలో తెలంగాణలోని ఒక గ్రామ పంచాయతి ఫోటోని ముద్రించింది. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో, వారి అసమర్థత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎంతటి మచ్చ తెస్తుందో తెలియచేయడానికి ఇదొక తాజా ఉదాహరణ. సమాచార శాఖ కమిషనర్ తెలంగాణకు చెందిన వాడు కావడంతో అధికారులు పనిలో పనిగా ఆయన మెప్పు పొందడానికి తెలంగాణకు చెందిన గ్రామ పంచాయతీ ఫోటో పెట్టారేమోనన్న అనుమానం కూడా చాలా మందికి కలుగుతోంది.




ఆంధ్రా ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలో ప్రచురించిన తెలంగాణ ప్రభుత్వ లోగోతో ఉన్న గ్రామ పంచాయతి ఫోటో

## ఒక వైపు పంచాయతీ పోరు మరోవైపు లేఖల హోరు...

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి, ఎన్నికల కమిషన్ తన అధికారాలు చూపించడానికి సస్పెన్షన్లు, బదిలీలు అంటూ లేఖల అస్త్రాలు సంధిస్తుంటే.. ప్రభుత్వం వాటిని తిప్పికొడుతూ జవాబులిస్తోంది. ఐఏయస్ అధికారులు గిరిజాశంకర్, గోపాలకృష్ణ ద్వివేదిలపై ఎన్నికల కమిషన్ ఇచ్చిన అభిశంసన ఆదేశాలను ప్రభుత్వం తిప్పి పంపింది. ఉన్నత స్థాయి అధికారులపై అభిశంసన విధించే అధికారం ఎన్నికల కమిషన్‌కి లేదని ప్రభుత్వం లేఖ రాసింది. ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ఇచ్చే ప్రోత్సాహకాలకు సంబంధించి బుధవారం కొన్ని దినపత్రికలలో ప్రభుత్వం ఇచ్చిన పత్రికా ప్రకటనపై కూడా ఎన్నికల సంఘం తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఇకపై కోడ్ అమలులో ఉన్నంత కాలం ప్రభుత్వం ఏ ప్రకటన ఇవ్వాలన్నా తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఎన్నికల కమిషన్ బదిలీ చేసే అధికారులందరినీ కోడ్ పూర్తైన తక్షణమే తిరిగి వారివారి స్థానాల్లో పోస్టింగులు ఇచ్చేస్తామని వైసిపి నాయకులు, మంత్రులూ బాహాటంగానే చెప్తున్నారు.

## అయోమయంలో ప్రభుత్వ ఉద్యోగులు

ఒక వైపు ఎన్నికల కమిషన్, మరోవైపు ప్రభుత్వం. ఎన్నికల కమిషన్ తాత్కాలికం, ప్రభుత్వం దీర్ఘకాలం ఉంటుంది. ఇప్పుడు ఉద్యోగులు ఎవరి మాట వినాలి. మింగమంటే కప్పకి కోపం.. విడవమంటే పాముకి కోపం అన్నట్లుగా ఉద్యోగుల పరిస్థితి అయోమయంలో పడిపోయింది. వీరిద్దరి మధ్య పోరులో ఉద్యోగుల నైతికత ప్రశ్నార్ధకంగా మారిపోయింది. మీకేం భయం లేదు మీకు తోడుగా మేమున్నాం అంటూ ఉద్యోగులకు ప్రభుత్వం పదే పదే భరోసా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మునిసిపల్ ఎన్నికలు...

పంచాయతీ ఎన్నికల ప్రక్రియను కొనసాగిస్తూనే, మునిసిపల్ ఎన్నికలను కూడా జరపడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నాహాలు ప్రారంభించిందని తెలుస్తోంది. ఫిబ్రవరి 3వ వారంలో నోటిఫికేషన్ ఇచ్చి మార్చిలో నిమ్మగడ్డ పదవీ విరమణ చేసేలోగా ఈ తంతు ముగించాలని చూస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## ఎవరి ధీమా వారిదే...

ఎన్నికలలో వైసిపిని దెబ్బకొట్టాలన్నది ప్రతిపక్షం లక్ష్యం. జగన్మోహన్‌రెడ్డితో వివాదం పెట్టుకున్న ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ని ఇప్పుడు తెలుగుదేశం పావుగా వాడుకుంటోంది. న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బ తిన్న జగన్ ప్రభుత్వాన్ని రేపు ఎన్నికలలో కూడా దెబ్బ తీయాలన్నది వారి లక్ష్యం. తియ్యగలమన్నది కూడా వారి ధీమా. అయితే... నవరత్నాలు అమలు జరిగాయి, రైతు భరోసా సక్రమంగా అందుతోంది, 'అమ్మ ఒడి' తల్లి ఒడికి చేరింది, పెన్షన్లు టంచన్‌గా అందుతున్నాయి, అక్కచెల్లెమ్మల పట్టాభిషేకం జరిగింది.. ఇలా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఇంటి గడప తట్టింది. ప్రతి మనసుని తాకింది. ఇప్పట్లో ఏ ఎన్నిక వచ్చినా నూటికి నూరు శాతం విజయం వారిదే అన్నది ఆ పార్టీ నేతల ధీమా!

## అంతా మంచికే...

అంతా సవ్యంగా జరిగి ప్రశాంతంగా నిర్వహింపబడాల్సిన ఎన్నికలు, నానా రచ్చలు, రాద్ధాంతాల తర్వాత ఇప్పుడు జరపబడుతున్నాయి. ఏది ఏమైనా అంతా మన మంచికే అనుకోవడం తప్ప ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందు మరో ప్రత్యామ్నాయం లేదు. ప్రభుత్వం ఏర్పడిన ఒకటిన్నర ఏడాదిలోనే (తొలి ఎన్నికల సమయంలోనే) ఉన్న లోటుపాట్లతో పాటు, కొంతమంది అసమర్ధత బయట పడిపోయే అవకాశం లభించింది. ఇలాంటి అవకతవకలన్నీ సరిదిద్దుకుని, సమర్థులను దగ్గరపెట్టుకుని, అసమర్ధులను దూరంపెట్టే అవకాశం ముఖ్యమంత్రికి లభిస్తుంది. ఇంకా మూడున్నరేళ్లు... ఆ తరువాత మరో ముప్పైయేళ్ళ తానే ముఖ్యమంత్రిగా పరిపాలన సాగించాలనుకుంటున్న జగన్మోహన్‌రెడ్డికి తన, మన తెలియడంతోపాటు, రాజకీయ చాణక్యత, సంయమనంతో సమస్యను చక్కదిద్దుకోగలిగే సమర్థత సమృద్ధిగా లభిస్తాయి.

# రాజ్యాంగ సంక్షోభం సమసిపోయింది సరే...!

రాష్ట్రం ఊపిరి పీల్చుకుంది. 'పంచాయతీ' పుణ్యమా అని రాజ్యాంగ సంక్షోభంలో చిక్కుకుంటుందని తెలుగు దేశీయులు సంబరపడిన రాష్ట్ర రాజకీయం తెరిపిన పడింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు- రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యలో తలెత్తిన 'పంచాయతీ' ఒక కొలిక్కి వచ్చింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సిందేనని బొడ్డుకు మసి పూసుకుని కూర్చున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ పంతానికి - రాష్ట్ర ప్రభుత్వం 'ఊ' కొట్టింది. అంటే- అయిష్టంగానైనా సరే - అంగీకరించింది. 'అయిష్టం' అనడానికి కారణం లేకపోలేదు.

రాష్ట్ర ప్రభుత్వ అయిష్టత ఏమిటో స్పష్టంగా తెలియడానికి- ఒక గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుందాం.

పంచాయతీలు రెండు రకాలు. మేజర్ పంచాయతీలు. మైనర్ పంచాయతీలు.

చాలా మేజర్ పంచాయతీలు - మినీ పట్టణాలుగా దర్శనమిస్తుంటాయి. ఇవి సాంకేతికంగా పంచాయతీలే కావడంతో- ఇప్పుడు ఎన్నికలు జరుగుతాయి. మన రాజ్యాంగం అలా చెప్పింది కనుక, అలా జరగాల్సిందే. తిరుగులేదు.

అయితే- ఎన్నికల నిర్వహణకు ఇది తగిన సమయం కాదన్న ప్రభుత్వ గొంతు- రాజ్యాంగ రణగొణ ధ్వనుల మధ్య ఎవరికీ వినిపించడం లేదు.



ఒక పంచాయతీలో ఓ తొమ్మిది మందికి తక్కువ లేకుండా వార్డ్ మెంబెర్స్ ఉంటారు. మేజర్ పంచాయతీలో అయితే 15 వరకు వార్డ్ మెంబెర్స్ ఉంటారు. అంటే- తక్కువలో తక్కువ 9 పోస్టులు. పార్టీల ప్రాతిపదిక కాదు కనుక ప్రతి పోస్టుకూ నలుగురైదుగురు పోటీపడతారు. అంటే - ఒక గ్రామంలో దాదాపు 30 మంది ఎన్నికల బరిలో ఉంటారు. పెద్ద పంచాయతీ అయితే-40,50 వరకు పోటీదారులు ఉంటారు. వీరంతా - తమ అనుచరులతో గ్రామంలో ప్రచారానికి దిగితే- కోవిడ్ నిబంధనలు గాలికి ఎగిరిపోవడం తథ్యం. నిబంధనలూ ఉండవు... అమలుచేసే వారూ ఉండరు. పాటించేవారూ ఉండరు.




శత్రు దుర్భేద్యమైన వైట్‌హౌస్‌లో అత్యంత సురక్షితంగా ఉండే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా మూతికి మాస్క్ పెట్టుకుని తిరుగుతుంటే- మన గ్రామాలలోని అమాయక జనం మాటేమిటి? మన రాష్ట్రంలో పదమూడు వేలకు తక్కువ లేకుండా చిన్న, పెద్ద గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

తెలంగాణలో ఎన్నికలు జరగలేదా అని వాదించే వారు ఉన్నారు. అయితే, తెలంగాణలో- ఒక నియోజకవర్గంలోనే ఉప ఎన్నిక జరిగింది. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరగడానికి ఒక రాష్ట్రంలోని 13 వేలపైబడి ఉన్న గ్రామాలలో ఎన్నికలు జరగడానికి తేడా లేదా?

హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అని అడిగేవారూ ఉన్నారు. హైదరాబాద్ కార్పొరేషన్‌లో నమోదు అయిన పోలింగ్ శాతం ఎంత? యాభై శాతం. అంటే- సగం మంది ఇళ్ళల్లోంచి బయటికి అడుగు పెట్టలేదు. అటువంటి ఎన్నిక- ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నదా? 'ఎలక్షన్' ముఖ్యం గానీ అది ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించడం ముఖ్యం కాదు అనే వారికో నమస్కారం.

రాష్ట్రంలో కరోనా ఇప్పుడిప్పుడే అదుపులోకి వస్తున్న దశలో- గ్రామాలలో ఎన్నికల ప్రచారం వల్ల- కరోనా కేస్‌లు గట్టిగా పెరిగే అవకాశం ఉంది. అందుకే... రాజ్యాంగ సంక్షోభం నుంచి రాష్ట్రం బయటపడినా... ఆరోగ్య సంక్షోభంలో చిక్కుకోబోతున్నది. మన గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాస్యత ఎక్కువ.

నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ది ఏం పోయింది? ఓ రెండు నెలలు ఆగితే, శుభ్రంగా దులిపేసుకుని, ఆయన దోవన ఆయన వెళ్ళిపోతారు. ఆరోగ్య సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని ఒడ్డున పడేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేగా!

ఈ కోణంలో నుంచే- ఎన్నికలు ఓ రెండు, మూడు నెలలు వాయిదా వేయించాలని ప్రభుత్వం భావించి ఉంటుంది. అయితే, ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఒప్పుకోలేదు. అందుకని, మన రాజ్యాంగం కూడా ఒప్పుకోలేదు. ఎన్నికల కమిషన్‌కు కర్తవ్య బోధ చేసింది.

ఇదే ఎన్నికల కమిషనర్- స్థానిక సంస్థలకు 2018లో ఎన్నికలు జరపాల్సి ఉంది. అయినా జరపలేదు. మరి, ఆయన తన విధులను అప్పుడు రాజ్యాంగ బద్ధంగా నిర్వహించినట్టేనా?

రాజ్యాంగానికి ప్రభుత్వం సరిగ్గా చెప్పలేకపోయిందో....లేక, ప్రభుత్వం చెప్పింది రాజ్యాంగం చెవికి సరిగ్గా ఎక్కలేదో అర్థం కావటం లేదు. ప్రభుత్వపరంగా కమ్యూనికేషన్ గ్యాప్‌కు లోటు ఏమీ లేదు. 'ఇదీ ప్రభుత్వ ఆలోచన' అని ప్రజలకు చెప్పే సమర్ధ యంత్రాంగం ముఖ్యమంత్రికి అందుబాటులో ఉన్న భావన కలగడం లేదు. 'యంత్రాంగం' అంటే- యంత్రాలు, నట్టులు, బోల్టులు అని కాదు. ప్రజలతో కనెక్ట్ కాగలిగిన నేత అయితే- ముఖ్యమంత్రి అంతరంగాన్ని ప్రజల ముందు ఆవిష్కరించగలుగుతారు. ఇప్పటికి దాదాపు 20 నెలలు గడిచాయి. ఇప్పటికీ, ఈ 'లోటు' ను భర్తీ చేసే విషయమై ముఖ్యమంత్రి సీరియస్‌గా ఆలోచిస్తున్న దాఖలాలు కనపడడం లేదు. అటువంటి ఏర్పాటు ప్రాముఖ్యాన్ని అసలు పరిగణనలోకి తీసుకున్నారా అనే అనుమానం కూడా కలుగుతున్నది. బంగారపు పళ్ళానికి కూడా- ఆనుకునే గోడ ఒకటి కావాలి. అదే ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి గారికి లేదు.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com



# సంకీర్తనల గానంతో పులకిస్తున్న నెల్లూరు

## శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలకు సమాయత్తమవుతున్న భక్తబృందం

*‘శ్రీ గణపతి సేవింపరాదే’.. అంటూ సౌరాష్ట్ర రాగంలో, ‘గిరిరాజ సుత’ అంటూ బంగలా రాగంలో అద్భుతంగా ఆలపిస్తున్న సంకీర్తనల గానాలతో నెల్లూరు నేల పులకించిపోతోంది. తెలతెలవారుతుండగానే త్యాగరాజస్వామి సంకీర్తనల గానంతో నెల్లూరు నగర వీధులు పరవశించిపోతున్నాయి. శ్రీ త్యాగరాజస్వామి వారి భక్తబృందం ఆ సంకీర్తనలను గానం చేస్తూ శ్రీత్యాగ రాజస్వామి ఉత్సవాలు చేపట్టేందుకు గత కొద్దిరోజులుగా నగరంలో భిక్షాటన చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు ఎంతో రాగయుక్తంగా, శృతిపక్వంగా పాడుతున్న సంకీర్తనలు నగర ప్రజలను భక్తిపారవశ్యులను చేస్తున్నాయి.*

త్యాగరాజ భిక్షువు..శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి నిరుపమాన భక్తితో ప్రారంభమై, వారి మిత్రుడు డాక్టర్ యనమండ్ర వెంకటేశ్వరశాస్త్రి సహకారంతో ఎప్పుడో 55 ఏళ్ళ కిందట.. 1965లో నెల్లూరులో అత్యద్భుతమైన రీతిలో ప్రారంభమైన భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్వామి స్మరణోత్సవాలను ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు స్మరణోత్సవ సభ కమిటీ సమాయత్తమైంది. తమ తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ఈ ఉత్సవాలకు అన్నివిధాలుగా ఎంతగానో సహకరిస్తున్న ప్రఖ్యాత సినీ నేపథ్యగాయకుడు, సాంబమూర్తి గారి తనయుడైన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) మృతి చెందడం, మరోవైపు కరోనా పెడుతున్న ఇబ్బందులు..అన్నీ తట్టుకుని యనమండ్ర వెంకటేశ్వరశాస్త్రి కుమారుడు నాగదేవిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### నగర వీధుల్లో ప్రారంభమైన భిక్షాటన :



నెల్లూరు నగరం ఇటీవలి కాలంలో బాగా విస్తరిస్తుండడంతో శ్రీ త్యాగరాజ స్వామివారి భిక్షాటన బృందం తమ వీధుల్లోకి కూడా వస్తే బావుంటుందని అనేక మంది కోరుతుండడంతో అందుకు తగ్గట్టుగా గత నవంబరులోనే భిక్షాటన ప్రారంభమైనా ఆ తర్వాత కరోనా నేపథ్యంలో మధ్యలోనే ఈ కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. ఇప్పుడు మళ్ళీ పరిస్థితులు కుదురుకుంటుండడంతో జనవరి రెండవ వారం నుంచి శ్రీ త్యాగరాజస్వామి భక్తబృందం భిక్షాటనకు బయలుదేరింది. భిక్షాటన ద్వారా వచ్చే సొమ్ముతో నెల్లూరు టౌన్‌హాల్‌లో ఏడురోజుల పాటు భక్తిభావాన్ని పెంపొందించే శాస్త్రీయసంగీత సభలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఈ భిక్షాటన బృందంలో స్థానిక భక్తులు, కొందరు ప్రముఖులు పాల్గొంటుండడం విశేషం. నిర్వాహకులు నాగదేవిప్రసాద్, దేవులపల్లి రామచంద్రమూర్తిలతో పాటు, అవధానం రామప్రసాద్, దుర్భా జనార్ధన్, ఆర్‌వి మల్లికార్జునరావు, నాగేశ్వరరావు, ఎస్.మాధవరావు, మహిళా భక్తులు లక్ష్మీకామాక్షి, కమల, కె.పద్మ, పామర్తి ఫణికుమారి తదితరులంతా కలసి వీధుల్లో త్యాగరాజస్వామి సంకీర్తనలను ఎంతో హృద్యంగా గానం చేస్తున్నారు. ఈ బృందానికి వేదవ్యాస సాయి, గోపాల్‌సాయి వయొలిన్‌తోను, ఈశ్వరసాయి కంజీరాతోనూ వాద్యసహకారం అందిస్తున్నారు.

### ఏప్రిల్ 2 నుంచి 8 దాకా.. శ్రీ త్యాగరాజస్వామి స్మరణోత్సవాలు :

ఈ ఏడాది మార్చి నెలాఖరుదాకా భిక్షాటన కొనసాగించి ఏప్రిల్ 2 నుంచి 8వతేది దాకా శ్రీ త్యాగరాజస్వామి 56వ స్మరణోత్సవాలను కన్నులపండువగా నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు యనమండ్ర నాగదేవిప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం నగరంలోని ఏసినగర్, ఉస్మాన్‌సాహెబ్‌పేట ప్రాంతాల్లో భిక్షాటన జరుగుతోందని, ఉదయం 7.15 నుంచి 9 గంటల దాకా, ఆదివారం రోజుల్లోనైతే సాయంత్రాలప్పుడు కూడా భిక్షాటన చేస్తామని ఆయన చెప్పారు. కరోనా నేపథ్యంలో అందరూ మాస్కులు ధరించి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలను జయప్రదం చేసేందుకు నగర ప్రజలందరూ తమవంతు సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. గణతంత్ర సంబరాలు



గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఏసి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి కృష్ణయ్య అధ్యక్షత్వంలో సమావేశం ఏర్పాటుచేసి గణతంత్ర దినోత్సవం విశిష్టతను అందరికీ వివరించారు. అనంతరం జెండాలు, మిఠాయిలు పంచిపెట్టారు. గౌరవాధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తితో దేశానికి తమవంతు సేవలందించాలని కోరారు. భారత కోళ్ళపరిశ్రమ పితామహుడు పద్మశ్రీ డా. బివిరావు 25వ వర్ధంతిని పురస్కరించుకుని వాకర్స్ మిత్రులకు, క్రీడాకారులకు కోడిగ్రుడ్లు పంచిపెట్టారు. అసోసియేషన్ కార్యదర్శి శ్రీమన్నారాయణ, కోశాధికారి లక్ష్మీనారాయణ, వీరిశెట్టి హజరత్‌బాబు, సోని, సూర్యారావు, వెంకటేశ్వర్లు, శివయ్య, చెంచయ్య, పిచ్చయ్య, మారుతీరావు, ప్రసాద్, వెంకటనారాయణ, జయరామయ్య, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వీక్షణం

# నిజం వర్సెస్ అబద్ధం

-మంజీర



ప్రజాస్వామ్యం నాలుగు స్తంభాల మీద నిలబడి మనుగడ సాగిస్తుంది. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతోపాటు ఫోర్త్ ఎస్టేట్ మీడియా. శాసన వ్యవస్థ పనితీరును ప్రజలకు దర్పణం పట్టేది మీడియానే. కార్యనిర్వాహక వ్యవస్థలో కొనసాగే జాగును దులిపేసేదీ మీడియానే. న్యాయవ్యవస్థ తీర్పులను తప్పు పట్టకూడదనే నియమాలకు లోబడుతూనే విశ్లేషణలతో జనాన్ని చైతన్యవంతం చేసేది కూడా ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియానే. అందుకే ఫోర్త్ ఎస్టేట్ మీద ప్రజలకు అంతటి గౌరవం, పాలకులకు అంతకు మించిన భయం. మరి మీడియా ఎలా ఉండాలి... అందుకు కూడా ఒక స్వీయ నిబంధనల జాబితా ఉంటుంది. అయితే మీడియా గ్లాసులో నిండిన సగాన్ని గుర్తించకుండా ఖాళీగా ఉన్న సగాన్నే చూడడం నేర్చుకుంది. ఇలా దశాబ్దాలు గడిచిపోయిన తర్వాత మీడియారంగం తనకు తానుగా మరో కొత్త కోణాన్ని ఒంటపట్టించుకుంది. అది పాలకుడు మనవాడైతే గ్లాసులో నిండిన సగాన్ని చూపిస్తూ కథనాలు అల్లడం, ‘మనవాడు’ కాకపోతే ఖాళీగా ఉన్న సగాన్ని వర్ణిస్తూ కథనాలు వండి వార్చడం. ఈ ఒరవడిలో ‘సగటు సామాన్యుడు’ విద్యావంతుడయ్యాడనే అసలు వాస్తవాన్ని మర్చిపోయింది మీడియారంగం. సామాన్యుడి మేధ కూడా విశ్లేషణ స్థాయికి వికసించిందనే నిజం మీడియా సింహాసనానికి అర్థం కావడానికి చాలా సమయమే పట్టింది. ఈలోపు సామాన్యుడు మీడియారంగం పట్ల విశ్వసనీయతను మెల్లమెల్లగా తగ్గించుకోసాగాడు. ఇలాంటప్పుడు మీడియా ఎలా ఉండాలి? తన మాటలో నూటికి నూరు శాతం నిజం ఉండేలా జాగ్రత్తపడాలి. అవాస్తవాల మూటలను దునుమాడి నిజాన్ని నిగ్గు తేల్చడానికి అవసరమైతే నిప్పుకణికలా కాలిపోవాలి. మీడియా తన స్వీయశీలతను నిరూపించుకోవాల్సిన విపత్కర పరిస్థితిలోకి నెట్టబడింది. విశ్వసనీయత పునాది మీద మనుగడ సాగించాల్సిన మీడియా రంగం... అంపశయ్య మీద రోజులు లెక్కించే స్థితికి చేరింది. అలాంటి సమయంలో నిధి రజ్దాన్ రూపంలో ఓ అబద్ధం మెరుపులా మెరిసింది. అంతలోనే అది పిడుగుపాటని తెలిసింది.

### నిజమే... నిప్పు కణిక

నిధి రజ్దాన్ సీనియర్ జర్నలిస్ట్. వయసు 43. జర్నలిస్టుగా 21ఏళ్లు. ఎన్డీటీవీలో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా టీవీక్షకులకు సుపరిచితం. జమ్ము కశ్మీర్ ఎన్నికలు, గుజరాత్ భూకంపం, ఇండియా–అమెరికా న్యూక్లియర్ ఒప్పందం, లండన్ ట్రైన్ బాంబింగ్ వంటి కీలకమైన అంశాలను రిపోర్ట్ చేసింది. మరెన్నో అంశాల మీద చర్చావేదికలను నిర్వహించింది. కశ్మీర్‌లో పర్యటించి పాకిస్థాన్ ఆధీనంలో ఉన్న కశ్మీర్ మీద డాక్యుమెంటరీలు చేసింది. ‘లెఫ్ట్, రైట్ అండ్ సెంటర్’ పేరుతో మంచి పుస్తకం రాసింది. ఈ ట్రాక్ రికార్డు ఆధారంగా చూస్తే ఆమె నోటి వెంట వచ్చే ప్రతి మాటలకు జవాబుదారీతనం ఉంటుందనుకుంటారు ఎవరైనా. గత ఏడాది జూన్‌లో ఆమె అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తనకు ఉద్యోగం వచ్చిందని చెప్తూ ఎన్డీటీవీకి రాజీనామా చేస్తున్నట్లు కూడా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఈ ఏడాది జనవరి నాటికి అది పూర్తిగా అబద్ధం అని తేటతెల్లమైంది. ‘నిజం చెప్పులు తొడుక్కునే లోపు అబద్ధం ఊరంతా తిరిగి వస్తుంది’ అనేది జర్నలిజంలో నేర్పించే తొలి పాఠాల్లో ప్రధానమైనది. ఒక వార్త రాసేటప్పుడు ... అందిన సమాచారంలో ‘నిజం ఎంత–అబద్ధం ఎంత’ అనేది విశ్లేషించుకోవాలని చెబుతుంది జర్నలిజం. విషయాన్ని వడపోసి నిజాన్ని మాత్రమే ప్రపంచానికి చాటి చెప్పాలని సూత్రీకరించింది జర్నలిజం. ఈ వృత్తిలో నిజం– అబద్ధం మధ్య నిరంతరం పోరు ఉండనే ఉంటుంది. ఈ రెండింటి మధ్యన సూత్రబద్ధ మీద నిలబడి ప్రపంచానికి నిజాన్ని చూపించాల్సిన నిబద్ధత కలిగిన వృత్తి జర్నలిజం. అలాంటి పాత్రికేయ వృత్తిలో నిధికి దశాబ్దాల అనుబంధం ఉంది. ఆమె తండ్రి మహారాజ్ క్రిషన్ రజ్దాన్ కశ్మీర్ పండిట్. పీటీఐ సంస్థలో ఎడిటర్ ఇన్ చీఫ్‌గా పని చేశారు. నిధి న్యూఢిల్లీలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ కోర్సు చేసింది. అలాంటి నిధి రజ్దాన్ చెప్పిన విషయాన్ని అబద్ధం అని ఎవరూ అనుకోలేదు. ఆ అబద్ధం నాలుగైదు నెలలపాటు వీర విహారం చేసింది. హార్వర్డ్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అనే డిజిగ్నేషన్‌తో చర్చల్లో పాల్గొన్నదామె. ఇంతకీ నిధి హార్వర్డ్‌కి ఎప్పుడు వెళ్తున్నట్లు? అని సాగిన అన్వేషణలో అసలు సంగతి బయటపడింది. హార్వర్డ్ యూనివర్సిటీ ఆమెను ఇంటర్వ్యూ చేయలేదు, అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వలేదు, జీతం ఇంత అని నిర్ధారించనూ లేదు. అక్కడి నుంచి ఎటువంటి ఆహ్వానమూ లేకనే ఇంత ప్రచారం జరిగిపోయింది. తీరా నిజం బయటపడిన తర్వాత ఆమె ట్విటర్ అకౌంట్‌ను మూసేసింది. తనను ఎవరో మోసం చేశారని సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. తన మీద సన్నగిల్లిన విశ్వసనీయతను తిరిగి నిలబెట్టుకోవడానికి ‘న్యాయపోరాటం చేస్తా’నని ప్రకటించాల్సి వచ్చింది. ఇదంతా ఏమిటి? ఆమె నిజంగానే మోసపోయిందా? లేక ఆమె నిజాన్ని దాచి ప్రపంచాన్ని మోసం చేసిందా? నిధి విషయంలో జరిగింది ఏదయినా కావచ్చు. అయితే జర్నలిజానికి మాత్రం మాయని మచ్చ. రాజకీయ నాయకులు నిజం మీద నిలబడకపోతే రాజకీయరంగం అంటేనే అబద్ధాల పుట్ట అని, ఒక ఉద్యోగి సకాలంలో పని పూర్తి చేయకపోతే ఉద్యోగిస్వామ్యం అంటేనే బద్ధకానికి పరాకాష్ట అని కథనాలు రాసే మీడియారంగానికి నిధి ఉదంతం పెద్ద విఘాతమే.

## సంగమేశ్వరుని సేవలో..

## ట్రైనీ ఎస్పీ మహేశ్వరరెడ్డి

ట్రైనీ ఎస్పీ మహేశ్వరరెడ్డి ఈనెల 24న సంగంలోని శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయానికి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ అధికారులు స్వాగతించారు. ఆ తర్వాత ఆయన సంగం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీచేసి స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటారు. రూరల్ డిఎస్పీ హరినాథ్‌రెడ్డి, బుచ్చి సిఐ సురేష్‌బాబు, సంగం ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణారెడ్డి సేవలు మరువలేం

దివంగత నాయకుడు, బిజెపి నెల్లూరు నగర మాజీ అధ్యక్షుడు సిహెచ్ రామకృష్ణారెడ్డి పార్టీకి చేసిన సేవలు మరువలేమని బిజెపి నాయకులు ఆయన్ను తలచుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణారెడ్డి 22వ వర్ధంతి సందర్భంగా ఈనెల 24న నెల్లూరులోని బిజెపి ఆఫీసులో జరిగిన సభలో బిజెపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, పార్టీ ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, గడ్డం విజయకుమార్, ముక్కు రాధాకృష్ణగౌడ్, నాగరాజారెడ్డి, కరణం భాస్కర్, నరసింహులు నాయుడు తదితరులు మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగించాలన్నారు. తొలుత రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నాయకులు నివాళులర్పించారు.

# జ్ఞా(గా)న గంధర్వుడికి..
# 'పద్మ విభూషణ్'

**భా**రతీయ సినిమా గాయకుడు, నెల్లూరు గానాలపట్టి, తెలుగుజాతి గర్వించ దగిన గానగంధర్వుడు, అపార సంగీత 'జ్ఞాన గంధర్వుడు'.. శ్రీ శ్రీపతి పండితా రాధ్యుల బాలసుబ్రహ్మణ్యం(ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం)కు దేశంలోనే రెండవ అత్యున్నత పౌర పురస్కారం 'పద్మ విభూషణ్' లభించడంతో దేశవ్యాప్తంగానే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాలు అభిమానులందరూ ఎంతగానో సంతోషిస్తున్నారు. జనవరి 26వ తేదీన 72వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 2021 సంవత్సరానికి 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. దేశ వ్యాప్తంగా పలు రంగాల్లో విశిష్టసేవలు అందించిన 120 మందిని 'పద్మ' పురస్కారాలకు ఎంపిక చేసింది. వారిలో ఏడు గురు ప్రముఖులకు 'పద్మ విభూషణ్' ప్రకటించింది. ఆ ఏడుగురు ప్రముఖుల్లో ఇంతటి ప్రతిష్టాత్మక 'పద్మ విభూషణ్' పురస్కారానికి ఎంపికైన వారిలో మన నెల్లూరు ముద్దుబిడ్డ బాలు ఒకరు కావడం సింహపురి సీమకే కాక, తెలుగుజాతికి, మొత్తం సంగీత ప్రపంచానికే గర్వకారణం. తన గంధర్వగానంతో అశేష ప్రజానీకాన్ని అలరించిన స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు కేంద్రప్రభుత్వం ఈ అత్యున్నత



పురస్కారాన్నిచ్చి గౌరవించడంతో తెలుగు వారు, ముఖ్యంగా నెల్లూరీయులు ఎంతగానో ఆనందించారు. బాలుకు తమిళనాడు కోటాలో ఈ అత్యున్నత పురస్కారం లభించేందుకు కృషిచేసి తమిళప్రజలు తమ అభిమాన గాయకుని రుణం తీర్చుకున్నారు.

## ఆ స్వరం.. ఆయనకో వరం

ఆయనది అమృత గానం. ఆ గానమే ఆయనకు ప్రాణం. ఆ స్వరమే ఆయనకో వరం. తన మధుర గానాలతో సినీ ప్రపంచాన్ని ఓలలాడించిన గాన గంధర్వుడాయన. ఒక్క మాటలో చెప్పాలంటే సినీ సంగీత ప్రపంచానికే ఆయనో 'మణి' దీపం. ఆయన ఏ పాట పాడినా, ఏ మాట మాట్లాడినా మృదుమధురంగా ఉంటుంది. ఎంతగా విన్నా ఆయన పాటలు, మాటలు అందరికీ ఇంకా ఇంకా వినాలనే ఉంటుంది. ఆబాలగోపాలమంతా ఆయన పాట కోసం ఉవ్విళ్ళూరేది. అంతగా ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న గానకళాకోవిదుడు మన నెల్లూరీయుడు కావడం నెల్లూరు సీమ చేసుకున్న అదృష్టం. అది ఎంత కఠినమైన పదజాలంతో ఉన్న గీతమైనా సరే అలవోకగా, మధురాతి మధురంగా పాడి శ్రోతలను మైమరపించే సమ్మోహనశక్తి ఆయనది. సినీరంగంలో అనేకభాషల్లో ఆయన పాడిన పాటలు నాటికీ, నేటికీ, ఏనాటికీ ప్రజల హృదయాల్లో చిరకాలం పల్లవిస్తూనే ఉంటాయి. ఆయనిప్పుడు భౌతికంగా మనకు దూరమైనా.. ఆయన పాట, మాట అన్నీ చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచేఉన్నాయి. ఆయన మరణించినా ఆయన పాటకు, వీనుల విందైన ఆ గంధర్వ గానానికి మరణమే లేదు.

## ఎన్నెన్నో విశిష్ట పురస్కారాలు, ఘన సత్కారాలు :

నెల్లూరుకు చెందిన ప్రముఖ హరికథా గానకళాకారుడు, త్యాగరాజస్వామి ఆరాధకుడైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి–శకుంతలమ్మల ముద్దుల తనయుడైన బాలు సినీరంగంలో ప్రవేశించి, సుమారు యాభైఏళ్ల సుదీర్ఘకాలంలో నేపథ్య గాయకునిగా తెలుగు, తమిళం, కన్నడం, హిందీ తదితర భారతీయ భాషల్లో వేలాది పాటలను అత్యద్భుతంగా గానం చేశారు. భారతీయ సినిమా గాయకునిగా ప్రఖ్యాతి చెందిన బాలు దాదాపు 40వేలకు పైగానే పాటలు పాడడం ఒక రికార్డు. జీవించినంతకాలం సినీరంగానికే మణిమకుటంలా భాసించారు. ఎన్నో విశిష్టమైన అవార్డులు, ఘన పురస్కారాలు అందుకున్నారు. తన గానప్రస్థానంలో 6 సార్లు జాతీయ పురస్కారాలు, మరో 6 సార్లు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకోవడమే కాక 1979లో వచ్చిన సంగీత ప్రధానమైన 'శంకరాభరణం' చిత్రానికి అద్వితయమైన రీతిలో పాటలు పాడి జాతీయ పురస్కారం అందుకున్న ఘనత ఆయనకే దక్కింది. ఆ తర్వాత 1981లో బాలివుడ్‌లో ప్రవేశించి హిందీలో 'ఏక్ దూజే కేలియే' చిత్రంలో కూడా ఆయన గానానికి మరోసారి జాతీయ పురస్కారం లభించింది. తెలుగులో సాగరసంగమం(1983), రుద్రవీణ (1988) చిత్రాల్లోనూ ఆయన పాటలకు జాతీయ పురస్కారాలు లభించాయి. ఇంకా 25 సార్లు ఉత్తమ గాయకునిగా, ఉత్తమ సంగీత దర్శకునిగా, ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, ఉత్తమ సహాయ నటునిగా ప్రతిష్టాత్మకమైన 'నంది' పురస్కారాలను కూడా అందుకున్నారు. 2016లో శతవసంత భారతీయ చలనచిత్ర మూర్తిమత్వ పురస్కారాన్ని కూడా నాటి కేంద్రమంత్రి నేటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకొని సంగీతరంగంలో తన ప్రఖ్యాతిని చాటుకున్నారు. బాలు గానానికి మెచ్చి తమిళనాడు, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పలుసార్లు విశిష్ట పురస్కారాలను ఆయనకు గౌరవంగా అందజేసి తమను తాము గౌరవించుకున్నాయి.

## విశిష్టమైన 'పద్మ' పురస్కారాలు :

అన్నిటికీ మించి దేశంలోనే అత్యున్నతమైన 'పద్మ' పురస్కారాలు కూడా అందుకోవడం బాలు గానమాధుర్యానికి నిదర్శనం. 2001లో ఎంతో విశిష్టమైన 'పద్మశ్రీ' పురస్కారం, 2011లో మరెంతో ప్రతిష్టాత్మకమైన 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్న బాలు, ఇప్పుడు తాజాగా 2021లో దేశంలోనే అద్వితీయమైన ద్వితీయ అత్యున్నత పురస్కారమైన 'పద్మ విభూషణ్' పురస్కారానికి కూడా.. ఆయన మరణానంతరం ఎంపిక కావడం విశేషం. దీంతో ప్రతి పదేళ్ళకోసారి దేశంలోనే ఎంతో విశిష్టమైన 'పద్మ' పురస్కారాలు బాలుకు లభించడం మరో విశేషం. ఈ పురస్కారాలన్నీ ఆయన గంధర్వగానానికి పులకించి పరవశించి.. వాటంతటవే వచ్చిన గౌరవ పురస్కారాలుగానే భావించవచ్చు. అయినా...బాలు ఇప్పుడు జీవించి ఉంటే ఎంతగా సంతోషించే వారో!.. ఆయన ఆనందాన్ని చూసి అభిమానులెంతగా మురిసిపోయేవారో!... ఇంకొక్క కొరత మాత్రం ఉంది.. 'భారతరత్న' పురస్కారం కూడా బాలుకు వస్తే బావుంటుందన్న ఆకాంక్ష ప్రపంచవ్యాప్తంగా ఆయన అభిమానుల్లో ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి బాలుకు 'భారతరత్న' విషయమై కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించి ఉన్నారు కూడా!

2020 సెప్టెంబరు 25వ తేదీన మృత్యువు పగబట్టినట్లుగా వచ్చి ఆ గాన గంధర్వుడిని మనకు కాకుండా దూరం చేసింది. ఏ కానరాని లోకాలకో తరలించుకుపోయింది..మృత్యువు కూడా బాలు మధురగానం విని తరించాలనుకుంది కాబోలు!... అయినా, తాను మరణించినా.. ఇంత గొప్ప 'పద్మ విభూషణ్' పురస్కారం ఆయనకు లభించిందంటే.. ఆయనకు మరణమెక్కడుంది?..

భౌతికంగా బాలు ఇప్పుడు లేకపోయినా.. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల, సంగీతాభిమానుల హృదయాల్లో ఆయన రూపం..ఆయన గానం ఎప్పటికీ నిలిచే ఉంటాయి.


***ఆ గానం ఆపాతమధురమే కాదు.. ఆచంద్ర తారార్కం కూడా!..***

# ఎస్‌విబిసి ట్రస్ట్‌కి వరప్రసాద్‌రెడ్డి దంపతుల కోటి రూపాయల విరాళం



శాంత బయోటెక్నిక్స్ ఛైర్మెన్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి - శ్రీమతి వసంత దంపతులు జనవరి 22వ తేదీ శుక్రవారం నాడు తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని, అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల వారిచే నిర్వహింపబడుతున్న శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానెల్ కోసం ఎస్‌విబిసి ట్రస్ట్‌కు కోటి రూపాయల విరాళాన్ని డి.డి రూపంలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి, వారి శ్రీమతి స్వర్ణమ్మలకు అందజేశారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com